

చెర్లోపల్లె లే అవుట్‌లో అక్రమంగా నిర్మిస్తున్న కట్టడాలు







చెర్లోపల్లె లే అవుట్‌ను.. చెరపట్టిన వైసీపీ నేతలు

- రూ.15 కోట్లు విలువ చేసే 500 పైగా ప్లాట్లు ఆక్రమణ
- ఇంటిదొంగల ప్రమేయంతో ఇష్టారాజ్యం
- అనధికారిక పట్టాలతో జోరుగా కట్టడాలు.. అమ్మకాలు
- ఆక్రమణలపై టీడీపీ నాయకుడి ఫిర్యాదు
- పట్టించుకోని రెవెన్యూ, కార్పొరేషన్ అధికారులు
- ప్రభుత్వం విచారణకు ఆదేశిస్తే.. వెలుగులోకి ఆక్రమణలు





చెర్లపల్లె లే అవుట్‌లోని వంకలో వైసీపీ నేత నిర్మిస్తున్న కట్టడం

కడప(రూరల్) జూలై 14: కడప కార్పొరేషన్ అదీనంలోని చింతకొమ్మదిన్నె మండలం పాపాసాబేపేట పంచాయతీ పరిధిలోని చెర్లోపల్లె లే అవుట్‌ను వైసీపీ నేతలు చెరపట్టారు. గత వైసీపీ పానలో రూ.15 కోట్లకు పైగా విలువచేసే 500లకు పైబడి ప్లాట్లను ఆక్రమించారు. ఇంటిదొంగల ప్రమేయంతో అనధికారిక పట్టాలను పుట్టించి.. యథేచ్ఛగా కట్టడాలు, అమ్మకాలను సాగిస్తున్నారు. ఇందిరమ్మ పేజ్-2 కింద అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం దాదావు 220 ఎకరాలలో చెర్లోపల్లె లే అవుట్‌కు రైతుల నుంచి తీసుకున్నారు. ఇందులో 130.33 ఎకరాలను మార్కెట్ చేసి ప్రతి ప్లాట్ సైజు (23ఇంటు32) 736 చదరపు అడుగులతో 4444 ప్లాట్లను ఏర్పాటు చేశారు. వీటిని లబ్ధిదారులకు ఇవ్వగా ఇంకా వందల్లో మిగిలివున్నాయి. ఇవి పోను 27.91 ఎకరాలు ఓపెన్ స్పేస్ ప్రాంతం ఉంచారు. అయితే ఓపెన్ స్పేస్‌గా ఉంచిన 27.91 ఎకరాలతోపాటు లబ్ధిదారులకు పోను మిగిలివున్న ప్లాట్లపై వైసీపీ నేతల కన్ను పడింది. వీటిని దక్కించుకోవడానికి స్కెచ్ వేశారు. స్థానిక రెవెన్యూ అధికారులకు ఆశచూపి గానా...బజానాతో అలరింపచేసి వారిని పావుగా వాడుకున్నారు. సదరు స్థలాలు రింగ్‌రోడ్‌కు పక్కనే ఉండడంతో ప్రాధాన్యతను బట్టి సెంటు స్థలం రూ.1 లక్ష నుంచి రూ. 2 లక్షల వరకు పలుకుతోంది. ఇంతటి విలువైన స్థలాలను మిడతల దండులా చెర్లోపల్లె లే అవుట్‌లో వాలిపోయి చాలా వరకు ఆరగించారు. సదరు స్థలాలను ఆక్రమించి 3 నుంచి 5 సెంట్ల హద్దుగల ప్లాట్లను అనధికారికంగా ఏర్పాటు చేశారు. కట్టడాలు లేని ఒక ప్లాట్ రూ.5 లక్షల నుంచి 8 లక్షల వరకు.. కట్టడాలు కట్టిన ఒక ప్లాటును రూ.10 నుంచి 15 లక్షల వరకు విక్రయించి సొమ్ముచేసుకుని కోట్లకు పడగలెత్తారు.

రాష్ట్రంలో జరిగిన సాధారణ ఎన్నికల్లో వైసీపీ ఘోరంగా ఓడిపోయి టీడీపీ కూటమి ప్రభుత్వం రావడంతో చెర్లోపల్లె లే అవుట్‌లోని ఆక్రమణలపై టీడీపీ నేతలు అధికారులకు ఫిర్యాదు చేసినా రెవెన్యూ, కార్పొరేషన్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో వైసీపీ నేతలు ఎవరెవరు ఎన్నిప్లాట్లు ఆక్రమించింది పేర్లతో సహా వారి చిట్టా సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. కలెక్టర్ లోతేటి శివశంకర్ తనదైన స్టైల్‌లో కొరడా ఝుళిపిస్తే ఆక్రమణలు వెలుగులోకి వస్తాయి. కలెక్టర్ నిక్కిచ్చిగా వ్యవహరించి అక్రమార్కుల భరతం పడతారనే పేరుంది. ఈ నేపథ్యంలో చెర్లోపల్లె లే అవుట్‌లో రూ. కోట్లల్లో జరిగిన భూ అక్రమాలపై నిజాయితీ గల అధికారులతో సమగ్రమైన విచారణ జరిపిస్తే భూ మాఫియా బండారం బయటపడుతుందని బాధితులు చెప్పుకొస్తున్నారు.

వాగులు, వంకలను వదలని వైసీపీ నేతలు

దాదాపు చెర్లోపల్లె లే అవుట్‌లో 130.33 ఎకరాలను మార్కెట్ చేసి మొత్తం 4444 ప్లాట్లను ఏర్పాటు చేశారు. ఇందులో సదరు లే అవుట్‌లో వెళ్తున్న వాగులు, వంకలను వదిలేసి లేఅవుట్ వేశారు. అయితే సదరు వాగులు, వంకలను కూడా కొందరు వైసీపీ నేతలు ఆక్రమించేశారు. ఇందులో పిల్లర్లు వేసి 5 నుంచి 10 సెంట్ల విస్తీర్ణంలో భవనాలను నిర్మిస్తున్నారు. ఈ తతంగం రెవెన్యూ అధికారుల కళ్లెదుటే జరుగుతున్నా పట్టించుకోకపోవడం గమనార్హం.

నగరపాలక సంస్థ గ్రీవెన్స్‌సెల్‌లో ఫిర్యాదు

చెర్లోపల్లెలోని ఇందిరమ్మ, జగనన్న లే అవుట్‌లో ఇళ్ల స్థలాలు పెద్ద సంఖ్యలో కబ్జాలకు గురయ్యాయని.. వాటిపై విచారణ జరిపించి బాధితులకు న్యాయం చేయాలని.. కబ్జాకు పాల్పడిన వారిపై తగు చర్యలు తీసుకోవాలని 2024 జూన్ 24న నగరపాలక సంస్థ గ్రీవెన్‌సెల్‌లో టీడీపీ తెలుగుయువత నాయకుడు వీరం రెడ్డి గోపాల్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. ఇందుకు కార్పొరేషన్ అధికారులు చెర్లోపల్లె పరిధిలోని ఇందిరమ్మ, జగనన్న కాలనీకి సంబంధించి ప్లాట్ అలాట్మెంట్ సీకేదిన్నె తహసీల్దార్ కేటాయించారు కాబట్టి.. తహసీల్దార్ కార్యాలయానికి లే అవుట్‌లో ప్లాట్ల అలాట్‌మెంట్ డేటా కొరకు లెటర్ పంపడం జరిగిందని.. వివరాలు వచ్చిన తరువాత తగు చర్యలు తీసుకుంటామని లిఖిత పూర్వకంగా ఫిర్యాదుదారునికి జూలై 6న తెలియజేశారు.

సోషల్ మీడియాలో హల్‌చల్


చెర్లోపల్లెలోని ఇందిరమ్మ, జగనన్న కాలనీలోని లే అవుట్‌లో 26 మంది నేతలు దాదాపు 1000 ప్లాట్లను ఆక్రమించినట్లు సోషల్‌మీడియాలో హల్‌చ్ చేస్తున్నాయి. వైసీపీకి చెందిన రింగ్‌రోడ్డు సమీపంలో హోటల్ నడుపుతున్న నేత 100 ప్లాట్లు, సర్పంచ్(వైసీపీ) 200 ప్లాట్లు, బాలుపల్లెకు చెందిన నేత 30 ప్లాట్లు, ఇదే గ్రామానికి చెందిన మరో నేత 30 ప్లాట్లు, మూలవంక గ్రామానికి చెందిన నేత 150 ప్లాట్లు, చింతకొమ్మదిన్నె గ్రామానికి చెందిన ఆర్ఎంపీ డాక్టర్ 100 ప్లాట్లు, చెర్లోపల్లె గ్రామానికి చెందిన నేత 100 ప్లాట్లు.. ఇదే గ్రామానికి చెందిన మరో నేత 50 ప్లాట్లు, బుసిరెడ్డిపల్లెకు చెందిన నేత 15 ప్లాట్లు, నరసన్నపల్లెకు చెందిన నేత 10 ప్లాట్లు, డీలర్ 10 ప్లాట్లు, ఓ వీఆర్‌వో 20 ప్లాట్లు, కడప మరియాపురం ఏరియాకు చెందిన నేత 10 ప్లాట్లు, ఊటుకూరులో సిమెంట్ దుకాణం నడుపుతున్న నేత 20 ప్లాట్లు, కడప నగరానికి చెందిన ఓ కార్పొరేటర్ 20 ప్లాట్లు, కొప్పర్తి గ్రామానికి చెందిన నేత 15 ప్లాట్లు, కమ్మవారిపల్లె గ్రామానికి చెందిన నేత 10 ప్లాట్లు, చింతకమ్మదిన్నె మండలంలోని ఓ సర్పంచ్ 21 ప్లాట్లు ఆక్రమించినట్లు సోషల్‌మీడియాలో గత కొంత కాలంగా హల్‌చల్ చేస్తోంది.

మాజీ సీఎం జగన్ మేనల్లుడి అనుచరులమంటూ..

వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మేనల్లుడు, కమలాపురం నియోజక వర్గ మాజీ ఎమ్మెల్యే కుమారుడు చింతకొమ్మదిన్నె జడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డి అనుచరులమని చెప్పుకుంటూ చర్లోపల్లె లే అవుట్‌లో కొందరు వైసీపీ నేతలు హల్‌చల్ చేసి యథేచ్ఛగా భూ ఆక్రమణలు సాగించి పాట్ల అమ్మకాలను సాగించారు. ఇందులో రాయచోటి రింగ్‌రోడ్డు సర్కిల్‌లో హోటల్‌ను నడిపి లీజుకు ఇచ్చిన ఓ నేత 100 ప్లాట్లు, మూలవంక సర్కిల్‌లోని మరో నేత 100 ప్లాట్లు, వైసీపీ సర్పంచ్ 200 ప్లాట్లు వరకు ఆక్రమించి సొమ్ము చేసుకున్నట్లు వినికిడి.

విచారణ జరిపిస్తే వాస్తవాలు వెలుగులోకి...

వైసీపీ అధినేత వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న పులివెందులోని జగనన్న హౌసింగ్ కాలనీలో అక్రమాలపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విచారణకు ఆదేశించారు. ఇదే తరహాలో చెర్లోపల్లెలోని ఇందిరమ్మ, జగనన్న లే అవుట్‌లో స్థలాల ఆక్రమణ వ్యవహారంపై ప్రభుత్వం విచారణకు ఆదేశిస్తే వాస్తవాలు వెలుగులోకి రానున్నాయి.



చెర్లోపల్లెలోని లే అవుట్‌లో స్థానిక వీఆర్‌వో సంతకంతో ఉన్న ఇంటిపట్టా

దేవతలారా.. రండి

- వైభవంగా ధ్వజారోహణం
- యాలి వాహనంపై దర్శనమిచ్చిన సౌమ్యనాథుడు





ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహిస్తున్న పండితులు

నందలూరు, జూలై 14: జిల్లాలో ప్రముఖ వైష్ణవ క్షేత్రంగా ప్రసిద్ధిగాంచిన నందలూరు సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండోరోజు ఆదివారం ఉదయం ధ్వజారోహణ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చక స్వాములు సునీల్‌కుమార్ బృందం ఆధ్వర్యంలో ధ్వజస్తంభంపై గరుడ చిహ్నంతో ఉండే పతాకాన్ని ఎగురవేసి ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించారు. ధ్వజారోహణం బ్రహ్మోత్సవాలకు సూచిక, సకల దేవతలకు ఆహ్వానం పలికే ధ్వజారోహణంలో మహావిష్ణువుకు గరుత్మంతుడు ప్రియ వాహనం. కావున ఆ గరుడ నిలువెత్తు రూపం 20 మీటర్ల నూతన వస్త్రంపై పసుపు, కుంకుమ, తైలంతో చిత్రీకరించారు. ఈ నూతన వస్త్రం ధ్వజస్తంభంపై ఎగురవేస్తే సకల దేవతలు బ్రహ్మోత్సవాలను తిలకిస్తారని ప్రతీతి. వేదమంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల మధ్య గరుడ ధ్వజపీఠాన్ని ధ్వజస్తంభాగ్రహణమునకు లాగారు. దీంతో ధ్వజారోహణం పూర్తయ్యింది. రాత్రి యాలి వాహనంపై మహాతేజోవంతుడు సౌమ్యనాథుడు శ్రీదేవి భూదేవితో కలిసి విశేష అలంకరణలో పుర వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

ఉత్సవాల్లో భాగంగా మూడోరోజు సోమవారం ఉదయం పల్లకిసేవ, గ్రామోత్సవం, తిరుమంజనం, రాత్రికి హంస వాహనంపై సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్‌కుమార్, టీటీడీ సూపరింటెండెంట్ హనుమంతు తెలిపారు.



యాలి వాహనంపై సౌమ్యనాథస్వామి

సత్తాచాటుతున్న ఆంధ్ర ఆటగాళ్లు

- మెన్, ఉమెన్ విభాగంలో విజేతలుగా నిలుస్తున్న జట్లు

పులివెందుల రూరల్, జూలై 14: పులివెందులలోని వైఎస్సార్ ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరుగుతున్న 2వ సౌత్‌జోన్ జూనియర్ చాంపియన్‌షిప్-2024 హాకీ పోటీలలో ఆంధ్రప్రదేశ్ ఉమెన్, మెన్ జట్లు సత్తాచాటుతున్నాయి. 11వ తేదీ గురువారం నుంచి జరిగిన పోటీలలో ఆంధ్రప్రదేశ్ జట్లు అత్యుత్తమ ఆట తీరును ప్రదర్శించి విజేతలుగా నిలి చాయి. ఆదివారం జరిగిన పోటీలలో సైతం తమ సత్తా చాటాయి. ఉమెన్స్ విభాగంలో తమిళనాడు-పాడిచ్చేరి మధ్య జరిగిన మ్యాచ్‌లో తమిళనాడు 15 గోల్స్ చేసి విజయం సాధించింది. కేరళ-తెలంగాణ మధ్య మ్యాచ్‌లో 5 గోల్స్ చేసి కేరళ, ఆంధ్రప్రదేశ్-కర్నాటక మధ్య జరిగిన మ్యాచ్‌లో 3 గోల్స్ చేసి ఆంధ్రప్రదేశ్ జట్లు విజయం సాధించాయి. మెన్స్ విభాగంలో కర్నాటక-తమిళనాడు మధ్య జరిగిన మ్యాచ్‌లో 4 గోల్స్ చేసిన కర్నాటక, కేరళ-పాండిచ్చేరి మధ్య జరిగిన మ్యాచ్‌లో 9 గోల్స్ చేసిన కేరళ, ఆంధ్రప్రదేశ్-తెలంగాణ మధ్య జరిగిన మ్యాచ్‌లో 2 గోల్స్ చేసిన ఆంధ్రప్రదేశ్ జట్లు విజయం సాధించాయని టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ బీఎం చాణిక్యరాజ్ తెలిపారు.



రైల్వేస్టేషను వరకు నాలుగులైన్లకు ప్రతిపాదనలు



రైల్వే ఓవర్‌బ్రిడ్జిని పనులను పరిశీలిస్తున్న అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్

ప్రొద్దుటూరు, జూలై 14: ఎర్రగుంట్ల రోడ్డులోని పెన్నా బ్రిడ్జి నుంచి రైల్వే స్టేషను వరకు వాసవీ సర్కిల్ మీదుగా బైపాస్‌రోడ్డును నాలుగు లైన్ల రహదారిగా ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు పంపాలని హైవే అథారిటీ ఈఈ విజయభాస్కర్ రెడ్డిని అనకాపల్లి ఎంపీ సీఎం రమే ష్ ఆదేశించారు. ఆదివారం జమ్మలమడుగు రోడ్డులోని రైల్వే ఓవర్‌బ్రిడ్జి పనులను పరిశీలించిన ఆయన మాట్లాడుతూ రైల్వే బ్రిడ్జిని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. రైల్వేస్టేషనుకు నాలుగు లైన్ల రహదారిని ఏర్పాటు చేసి ప్రొద్దుటూరును అన్ని విధాలా అభివృద్ధి చేయడమే తన లక్ష్యమ న్నారు. ప్రొద్దుటూరు వాసులు, వ్యాపారుల అభ్యర్థన మేరకు ప్రొద్దు టూరు నుంచి బెంగుళూరుకు రైలును పొడిగించడం, విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్‌ను కడప నుంచి ప్రొద్దుటూరు వరకు ఎక్స్‌టెన్షన్ చేయడంపై రైల్వే అధికారులతో సంప్రదించి చర్యలు తీసుకుంటామన్నారు.

బస్సు - లారీ ఢీ

- ఒకరు మృతి.. 20 మందికి గాయాలు



మృతి చెందిన తారకరాముడు


నందలూరు, జూలై 14: కడప-చెన్నై జాతీయ రహదారిలో నందలూరు ఆల్విన్ కర్మాగారం సమీపంలో తిరుపతి నుంచి జమ్మలమడుగు వెళుతున్న ఏపీ 39 యాడబ్ల్యూ 3222 ఆర్టీసీ బస్సును కడప నుంచి చెన్నైకి వెళుతున్న ఏపీ 39యూవీ 0342 లారీ ఢీకొనడంతో బస్సు కండక్టర్ తారక రాముడు (40) అక్కడికక్కడే మృతి చెందాడు. లారీ డ్రైవర్ మల్లేల ధనంజయ్య లారీలో, బస్సు డ్రైవర్ రాజు బస్సులో ఇరుక్కుపోయారు. బస్సులో ఉన్న ఆరుగురికి తీవ్ర గాయాలు కాగా మరో 14 మందికి స్వల్ప గాయాలయ్యాయి. వారిని కడప, రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించారు. ఇరుక్కుపోయిన లారీ, బస్సు డ్రైవర్లను కాపాడేందుకు పోలీసులు, స్థానికులు జేసీబీల సహాయంతో విశ్వ ప్రయత్నం చేసి ఎట్టకేలకు ఇద్దరిని కాపాడి కడప రిమ్స్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతున్నారు. ప్రమాదం జరిగిన సంఘటన స్థలానికి స్థానిక ప్రజలు తండోపతండాలుగా తరలివచ్చారు. కడప-చెన్నై రహదారిలో 2 గంటల పాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పోలీసులు, స్థానికులు, అగ్నిమాపక సిబ్బంది గాయపడినవారిని చికిత్స నిమిత్తం రాజంపేట, కడప ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించారు.

రైతన్నకు అందించే వ్యవ'సాయ' రుణంలో కొంత మంది చేతివాటం ప్రదర్శిస్తున్నారు. వసూలు చేసిన మొత్తంలో నుంచి తిలా పాపం తలా పిడికెడు.. అన్నచందంగా పంచుకుతింటున్నారు. వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘా ల్లో కొంత మంది సీఈవోలు చేతివాటం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. కొంత మంది సీఈవోలు, వారి కుటుంబ సభ్యుల పేరుపైన, బినామీల పైన తప్పుడు లోన్లు తీసుకున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. అదే విధంగా వైసీపీ నాయకులు సొసైటీలకు చైర్‌పర్సన్‌గా ఉంటూ కోట్లాది రూపాయలు బినామీ పేర్లతో రుణాలు పొందిన విషయం జగమెరిగిన సత్యం. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ నాయకుల ఆగడాలకు మడుగులొత్తుతూ వారి పబ్బం గడుపుకుంటూ కొంత మంది సీఈవోలు కోట్ల రూపాయలకు పడగలెత్తినట్లు తెలుస్తోంది.



సొసైటీ రుణాల మంజూరులో చేతివాటం..!

- కోట్లకు పడగలెత్తిన సీఈవోలు
- బ్యాంకు అధికారులకూ పర్సంటేజీలు
- అన్నదాతకు తప్పని రుణభారం



కడప (ఎన్టీఆర్ సర్కిల్), జూలై 14: జిల్లాలో దాదాపు 20 మంది సీఈవోలు రైతన్నల సొమ్ముతో రాజభోగం అనుభవిస్తున్నారని తెలుస్తోంది. సీఈఓగా ఉద్యోగంలో చేరిన తరువాత స్థిరాస్తులు సైతం భారీగా పెరిగినట్లు చర్చ నడుస్తోంది. వాస్తవంగా సొసైటీల్లో రైతులకు రుణాలు మంజూ రు చేయడంలో కీలక బాధ్యత సీఈవోలదే. ఇదే అదనుగా కొన్ని సొసైటీల్లో అవినీతిని ప్రోత్సహించి సొమ్ము చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. రైతులు తమ భూములు తనఖా పెట్టుకుని రుణాలు ఇవ్వమని సీఈవోల వెంబడి కాళ్లు అరిగేలా తిరిగినా కనీసం పలకరింపులు కూడా ఉండవు. ఒకవేళ వారు లోన్ చేస్తామని పాస్ బుక్‌లు తీసుకుంటే లోన్ చేసే లోపు రైతులను సగం పీల్చి పిప్పి చేస్తారని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు లక్షలు రుణ మందితే అందులో సీఈవోలు, వారి సిబ్బందికి వేలాది రూపాయలు ముడుపులు అప్పజెప్పాల్సిందేనని వాపోతున్నారు. ఈసీకి, రిజిస్ట్రేషన్‌కి అంటూ వేలాది రూపాయల డబ్బులు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అలాగే సూపర్‌వైజరుకు, మేనేజరు, పర్సంటేజీల రూపంలో రైతుల నుంచి అనధికారికంగా వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇది కాకుండా అధికారికంగా మూలధనం కింద కొంత శాతాన్ని మినహాయించుకుని రుణం మొత్తాన్ని ఖాతాలో జమ చేస్తారు. కానీ రైతులు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించకపోతే భూములు వేలం వేస్తామని హెచ్చరించడంతో పాటు కొన్ని సందర్భాల్లో వేలం వేసిన పరిస్థితులు కూడా ఉన్నాయి.

రుణం.. రైతన్నకు మరింత భారం

పంటల సాగుకు తప్పనిసరి పరిస్థితుల్లో అప్పు చేయాల్సిన పరిస్థితి తప్పడం లేదు. దీంతో బయట వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తే వేలకు వేలు వడ్డీలు వసూలు చేసి నడ్డి విరుస్తున్నారు. ఈ నేపథ్యంలో బ్యాంకులను ఆశ్రయిస్తే రుణం చేతికందే సమయానికి వివిధ రకాల ఖర్చులు చెబుతూ పీల్చి పిప్పి చేస్తున్నారని.. ప్రైవేటు వడ్డీ వ్యాపారులే నయం అనిపించేలా కొంత మంది సొసైటీ, బ్యాంకు అధికారుల ప్రవర్తన ఉందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివిధ కారణాలతో వసూలు చేసిన డబ్బు తిరిగి వడ్డీలతో సహా చెల్లించాల్సిన పరిస్థితి ఉండడ ం బాధ కలిగిస్తుందని వాపోతున్నారు.

పర్సన్ ఇన్‌చార్జ్‌లదే పెత్తనం

ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీలో పర్సన్ ఇన్‌చార్జ్‌లదే పెత్తనం కొనసాగుతుంది. వీరిని రాజకీయ నాయకులు నియమిస్తారు. వీరు రాష్ట్రంలో ముఖ్యమంత్రి ఎలా పెత్తనం చెలాయిస్తాడో.. అలాగే వారి సొసైటీల్లో పెత్తనం చెలాయిస్తూ ఉంటారు. ఇదే అదనుగా వారి బంధువులకు.. బంధువుల బంధువులకు లక్షలాది రూపాయలు రుణాలు మంజూరు చేయించుకుంటుంటారనే ఆరోపణలు ఉన్నాయి. ఇలా కొన్ని సొసైటీల్లో చైర్‌పర్సన్లు కోటి నుంచి రెండు కోట్ల రూపాయల వరకు రుణాలు పొందినట్లు తెలుస్తోంది. వీటిని గమనించి ఆడిటింగ్ చే సి చర్యలు తీసుకునే నాథుడే కనిపించడం లేదు.

బద్వేలు బ్యాంకు పరిధిలోని బికోడూరు సొసైటీ ప్రెసిడెంట్ దాదాపు కోటి రూపాయల రుణం తీసుకున్నట్లు తెలుస్తోంది. అది కూడా ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగుల పేరు పైన తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ విధంగా రుణాలు తీసుకుని బ్యాంకుకు శఠగోపం పెట్టారని అర్థమవుతుంది. బద్వేలు నియోజకవర్గంలోనే మరో రెండు మండలాల్లోని కాశినాయన, కలసపాడు సొసైటీల్లో పనిచేస్తున్న సీఈవోలు తమ బంధువుల పేర్లతో బోగస్ రుణం పొందినట్లు తెలుస్తోంది. ఓ సాధారణ రైతు సొసైటీ బ్యాంకు నుంచి రుణం పొందితే.. ఆ రైతు పంటలు సరిగా చేతికందక అప్పుల పాలై సకాలంలో చెల్లించలేకపోతే.. ఆ రైతు పొలాన్ని వేలం వేసేందుకు సొసైటీ అధికారులు మందీ మార్బలంతో వచ్చి గ్రామంలో రైతు పరువు తీసి ఇంట్లో ఏ వస్తువులు ఎత్తుకెళ్లిన పరిస్థితులు ఉన్నాయి. మరి సొసైటీ ప్రెసిడెంట్లు కోట్ల రూపాయల్లో రుణాలు తీసుకుని బ్యాంకుకు శఠగోపం పెట్టినా ఎలాంటి చర్యలు చేపట్టిన దాఖలాలు లేవు. ఎవరైనా డీసీసీ బ్యాంకులోని ప్రధాన అధికారుల దృష్టికి సొసైటీలో జరుగుతున్న అక్రమాలను తీసుకువెళ్తే సమాచారం ఇచ్చిన వ్యక్తుల నుంచి రాతపూర్వకంగా ఇవ్వాలంటూ చెబుతుండడం వల్ల ఫిర్యాదు చేసేందుకు కూడా ఎవరూ ముందుకు రావడం లేదనేది సమాచారం.

ఉన్నతాధికారులు దృష్టి సారించాలి

ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై కలెక్టర్ దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. గత కొన్ని సంవత్సరాలుగా ఆరోపణలు వినిపిస్తున్న పులివెందుల, బద్వేలు, కమలాపురం నియోజకవర్గాల్లోని సొసైటీలపై సమగ్ర విచారణ జరిపిస్తే అక్రమాలు వెలుగు చూసే అవకాశాలు లేకపోలేదని అభిప్రాయం వ్యక్తమవుతుంది. అదే విధంగా జిల్లాలో ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీలో సీఈవోగా పనిచేస్తున్న వారితో పాటు వారి బంధువుల ఆస్తులు వివరాలను రికార్డుల్లో నమోదు చేయాల్సిన అవసరం ఉంది. ఈ వివరాలను ఇప్పటికే పలు దఫాలుగా డీసీసీ బ్యాంకు ప్రధాన కార్యాలయ అధికార యంత్రాంగం అడిగినప్పటికీ సీఈవోల నుంచి ఏ మాత్రం స్పందన కనిపించడంలేదని తెలుస్తోంది. ఇప్పటికైనా జిల్లా కలెక్టరుతో పాటు సహకార శాఖ ఉన్నతాధికారులు దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ విషయమై బ్యాంకు ఇన్‌చార్జ్ సీఈవో రోజా రమణిని వివరణ కోసం ప్రయత్నించగా.. ఆమె కంటికి శస్త్ర చికిత్స చేయించుకోవడం వల్ల అందుబాటులో లేరని తెలిసింది.

పాముతో పచారాలు - గుర్తించాక పరుగులు


వాహనం హ్యాండిల్‌కు చుట్టుకుని ఉన్న పాము


చెన్నూరు, జూలై 14: తాను నడిపే ద్విచక్ర వాహనం హ్యాండిల్‌కు చుట్టుకున్న పామును గమనించక దానితోనే ఊరంతా పచారాలు చేశాడు. కాలుకు తగిలింది పామని గుర్తించాక పరుగులు అందుకున్నారు. నరసారెడ్డిపల్లెకు చెందిన జయరామిరెడ్డి వ్యవసాయ పనులు చేసుకునేవాడు. తన టీవీఎస్ మోపెడ్ ఇంటి ముందు ఉంచి ఇంటికి వెళ్లి తిరిగి పెట్రోలు పట్టించుకునేందుకు బండిలో చెన్నూరుకు వచ్చాడు. అప్పటికే వాహనం హ్యాండిల్ హెడ్‌లైటు మధ్య ఓ పాము చుట్టుకుని ఉంది. ఈ విషయం అతను గమనించలేదు. చెన్నూరుకు వచ్చి చెన్నూరులో పెట్రోలు పట్టుకుని అదే వాహనంలో చెన్నూరు పాతబస్టాండుకు వస్తుండగా అప్పటి వరకు చుట్టుకున్న పాము కాసింత కదిలి ఆయన కాళ్ల కిందకు చేరింది. కాలికి మెత్తగా తగలడంతో ఏమిటని చూసి ఒక్కసారిగా షాక్‌కు గురయ్యాడు. అప్పటి వరకు ఆ పామును గమనించని జయరామిరెడ్డి దాన్ని చూడగానే ఒక్కసారిగా మైండ్ బ్లాక్ అయి భయపడి వాహనాన్ని రోడ్డుపైనే వదిలేసి పరిగెత్తాడు. ఈ విషయాన్ని దారిన పోయేవారు గమనించి దాన్ని చూసి ఆశ్చర్యపోయారు. ఇంత సేపూ వాహనానికి చుట్టుకున్న పాము మీకు కనిపించలేదా అంటూ అడిగి తరువాత కర్రలతో పామును కొట్టి చంపివేశారు.

మానసిక వ్యాధుల పట్ల 200 మందికి అవగాహన


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ సూపరింటెండెంట్ తదితరులు

కడప (సెవెన్‌రోడ్స్), జూలై 14: కడప ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి పరిధి మెంటల్ కేర్ ఆస్పత్రిలో ఆదివారం రాయలసీమ జోన్ మానసిక వ్యాధుల పీజీసీఎంఈ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి దాదాపు 200 మంది రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు. ఇందులో సైక్రియాటిక్ పీజీలు 50 మంది సైకియాటిక్ డాక్టరు 40 మంది మిగిలిన వారు జనరల్ వైద్యులు పాల్గొన్నారు. శారీరక వ్యాధుల పట్ల మానసిక సమస్యలకు సంబంధించి నిర్వహించారు. చర్మవ్యాధులు, గుండె, క్యాన్సర్ వ్యాధులు దీర్ఘకాలిక వ్యాధులతో వచ్చే మానసిక సమస్యలపై సీనియర్ ప్రొఫెసర్లు ఈ అవగాహనలో అభిప్రాయాలు పంచుకున్నారు. కార్యక్రమానికి ప్రారంభోత్సవ అతిధిగా రిమ్స్ వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ, నోడల్ ఆఫీసరుగా కర్నూలు డాక్టర్ నాగేశ్వర్‌రావు వ్యవహరించారు. కార్యక్రమంలో సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి, డిప్యూటీ సూపరింటెండెంట్ సురేశ్వర్‌రెడ్డి, పులివెందుల ప్రొఫెసరు డాక్టర్ శంకర్‌రెడ్డి పాల్గొన్నారు. రాయలసీమ జోన్ ప్రభుత్వ ప్రైవేటు కళాశాల సైకియాట్రిక్ పీజీలు ఐఎంహెచ్ డాక్టర్లు, పీజీలు, మెంటల్ కేర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ వెంకట్రాముడు వైద్యులు, పీజీలు, వైద్యేతర సిబ్బంది పాల్గొన్నారు. ఈ సమావేశం కడపలో మొట్టమొదటిసారిగా నిర్వహించారు.

పుష్పగిరి ఆలయ శిల్పసంపద రమణీయం



పుష్పగిరి చెన్నకేశవాలయంలో శిల్పాలు

కడప (ఎర్రముక్కపల్లె), జూలై 14: పుష్పగిరి ఆలయ శిల్పసంపద రమణీయమని వైవీయూ లలిత కళల విభాగాధిపతి డాక్టర్ మృత్యుంజయరావు తెలిపారు. ఆదివారం పుష్పగిరిలో చెన్నకేశవాలయంలో శిల్ప సంపదను పరిశీలించిన ఆయన మాట్లాడుతూ రాయలసీమలో ఉన్న శిల్ప సంపదను కాపాడుకోవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రాయలసీమ దేవాలయాల్లో కన్నా చాలా సున్నితంగా చిన్న చిన్న వివరాలను సైతం సూక్ష్మమైన శిల్పాల్లో చూపించడం చాలా గొప్ప విషయమన్నారు. కవి భారవి రచించిన కిరాతార్జునీయం అంశంపై పరిశోధన వ్యాసం నిమిత్తం చెన్నకేశవాలయం ప్రాకారాలపై అధ్యయనం చేశామన్నారు. లేపాక్షి దేవాలయం, కిరాతార్జునీయం కథను ఒకే గోడపై చక్కగా పుష్పగిరిలో చాలా చిన్న పరిమాణంలో కీలక ఘట్టాలను ఓకేచోటున కాకుండా ఆలయ అధిష్ఠానం నలుదిక్కులా గోడలపై ఐదుఘట్టాలుగా చెక్కించారన్నారు. కథపై ఆసక్తిగొలిపేందుకే శిల్పి ఇలా చెక్కి ఉంటాడని తెలిపారు. ఆరంగులాల ఎత్తు నుంచి పది అంగుళాల పరిమాణంలో శ్రీ మహావిష్ణువు, వృషభ రూఢ మూర్తి, నటరాజు, అంధకాసుర మూర్తి, నాట్యగణపతి, రామలక్ష్మణులు, వరాహమూర్తి ప్రతిమలను సున్నితమైన వివరాలతో ఆభరణాలతో నిండుగా చిత్రించడం గొప్ప విషయమని అలాంటి అద్భుత కళను అందరూ చూడాలన్నారు. విజయనగర శిల్ప కళావైభవం ప్రతీకకు ఉచ్ఛదశలో కళ అని ఈ శిల్పాల్లో చోళ శిల్పశైలి మిళితమై కనిపిస్తాయన్నారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత


ఇసుక ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలింపు చేసిన దృశ్యం

జమ్మలమడుగు, జూలై 14: నాలుగు నెలల నుంచి జమ్మలమడుగులో ఇసుక ట్రాక్టర్లు పట్టుకోవడంలేదని విమర్శలున్నాయి. అధికారులు, సిబ్బంది అక్రమ ఇసుకాసురులపై స్పందించడంలేదని స్థానిక ప్రజల ద్వారా ఆరోపణలున్నాయి. అయితే ఇటీవల కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి అక్రమ ఇసుకాసురులను పట్టుకోవాలని పోలీసులకు ఆదేశాలిచ్చారు. అయితే పోలీసు అధికారులు కొందరిని మాత్రమే పట్టుకున్నట్లు ఆరోపణలున్నాయి. ఇటీవల రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టుకుని ఆర్టీసీ గ్యారేజీలో పోలీసులు పెట్టారు. అందుకు సంబంధించి యజమాని స్టేషన్ చుట్టూ తిరిగినా జరిమానా విధించకుండా ఇబ్బంది కలిగిస్తున్నట్లు బాధిత వ్యక్తి తెలిపారు. అయితే శనివారం రాత్రి మరో రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నారు. వాటిని ఆదివారం సాయంత్రం ఆర్టీసీ గ్యారేజీలోకి తీసుకెళ్లారు. ఈ సమస్యకు సంబంధించి అర్బన్ పోలీసు స్టేషన్ ఎఎస్ఐ మురళీయాదవ్‌ను వివరణ కోరగా శనివారం రాత్రి రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు వాటిని ఆర్టీసీ గ్యారేజీలోకి చేర్చినట్లు ఆయన తెలిపారు. ఈ సమస్యలకు సంబంధించి జిల్లా పోలీసు అధికారులు పట్టణంలో అక్రమ ఇసుక రవాణాపై విచారణ జరపాలని లేదా పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్న సిబ్బందిని అడిగి విచారణ చేయాలని పలువురు కోరుతున్నారు.

ఇసుక లారీల పట్టివేత

ఎర్రగుంట్ల, జూలై 14: పోట్లదుర్తి సమీప పెన్నా నదీ పరివాహక ప్రాంతం నుంచి అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్న వాహనాలను శనివారం అర్ధరాత్రి ఎర్రగుంట్ల పోలీసులు పట్టుకున్నారు. రెండులారీలు, ఒక ట్రాక్టర్, ఎక్స్‌కవేటర్‌ను కూడా స్వాధీనం చేసుకున్నారు. వాహనాలను సీజ్ చేసి కేసు నమోదు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వెల్లటూరులో ఘనంగా చిన్నసరిగెత్తు


ఊరేగింపుగా వెళ్తున్న పీర్లు

పెండ్లిమర్రి, జూలై 14: మండలంలోని వెల్లటూరు గ్రామంలో మొహర్రం వేడుకల్లో భాగంగా ఆదివారం చిన్నసరిగెత్తు కార్యక్రమం ఘనంగా జరిగింది. మాజీసర్పంచు పెద్ద మల్లారెడ్డి కుటుంబీకులు పీరుకు పూలమాలలు సమర్పించి మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపు నిర్వహించారు. హిందూ, ముస్లింలు సోదర భావంతో కార్యక్రమంలో పాల్గొన్నారు. మంగళవారం రాత్రి గుండం కార్యక్రమం, బుధవారం పెద్దసరిగెత్తు కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు బాబా ఫక్రుద్దీన్, బాబు, మీరుసాహెబ్ తెలిపారు.

అప్పులు మిగిల్చిన మామిడి


సింగనమల వద్ద కాపులేక ఉన్న పునాస రకం మామిడి తోట

కాయలు కాయక.. ధరలు లేక... కుప్పకూలిన రైతన్న

పెనగలూరు, జూలై 14: మండలంలో రైతులకు ప్రధాన ఆదాయ వనరు పంట మామిడి ఈ ఏడాది రైతులకు అప్పులు మిగిల్చాయి. కాగా మండలంలో ఉన్న కమీషన్ ఏజెంట్ల వ్యాపారం కూడా అంతంత మాత్రంగానే మిగిలిపోయింది. ఇక వ్యాపారులు ధైర్యం చేసి ముందుగా పంటపై పెట్టుబడులు పెట్టలేకపోయారు. అంతకంటే ముందు తోటలపై దిగుబడి కోసం భారీగా పెట్టుబడులు పెట్టిన రైతన్నలు కుప్పకూలి పోయారు. ఈ ఏడాది మండలంలో దాదాపు 95 శాతం మామిడి తోటలు దిగుబడి ఇవ్వలేకపోయాయి. మామిడి కాపును నమ్ముకుని వ్యవసాయం చేస్తున్న రైతులు పంట దిగుబడి బాగా రావాలని అప్పు తెచ్చి బాగా మందులను పిచికారీ చేశారు. ఒక దఫా పిచికారీ చేసినప్పుడు పూత రాకుంటే మళ్లీ పిచికారీ చేస్తూ వచ్చారు. దానిలో కూడా రాక పోతే మూడో దఫా కూడా మందులను పిచికారీ చేసి నిట్టూర్పుగా నిస్సహాయ స్థితిలో నిలిచిపోయారు. ఎకరాకు వెయ్యి రూపాయల చొప్పున కనీసం ఐదెకరాల తోటకు ఐదు వేల రూపాయలు క్రిమి సంహారక నివారణ చర్యల కోసం మందులు వాడిన రైతులు మూడు దఫాలు రూ.15 వేలను ఖర్చు పెట్టాల్సి వచ్చింది. సస్యరక్షణ కోసం ట్రాక్టర్‌తో దుక్కి దున్నకాలు, చెట్లు పాదులు కలిపి మరో రూ.5 వేలు ఖర్చు వచ్చింది. ఈ విధంగా ఏడాదికి రూ.30 వేలు పైబడిన ఖర్చు రైతులకు భారంగా మారింది. ఎన్ని చేసినా పెట్టిన పెట్టుబడిలో కనీసం పది శాత మైనా కాయలు కాయక రైతు నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దిగుబడి కోసం వ్యయ ప్రయాసల కోర్చి రైతులు మామిడి సాగుపై పెట్టుకున్న ఆశలు పూర్తిగా నిరాశ్రయులయ్యారు. ఇక మామిడి సాగు పై ఆసక్తి సన్నగిల్లుతోంది. ప్రకృతి వైపరీత్యాలు కారణమా, అధిక మోతాదులో మందులు పిచికారీ ప్రభావమా అని రైతులు సందిగ్ధంలో పడిపోయారు. అయితే రైతులకు పంట దిగుబడులపై పూర్తిగా ఉద్యానశాఖ అధికారులు అవగాహన కల్పించకపోవడం దారుణం. ఇదిలా ఉండగా ప్రధాన కాపు తర్వాత అన్‌సీజన్‌లో వచ్చే ఉమ్మకాపు కూడా ఈ ఏడాది కాయ కపోవడం చాలా బాధాకరమని రైతన్నలు లబోదిబోమంటున్నారు. ప్రధాన కాపు ముగిసిన తర్వాత నీలం మామిడి చెట్లలో కనీసం 20 శాతం నుంచి 50 శాతం వరకు కాయలు దిగుబడి వచ్చేవి. ఈ ఏడాది ప్రకృతి వైపరీత్యాలు, మందుల పిచికారీ ప్రభావంతో ఆ ఆశ కూడా రైతులకు లేకుండా పోయింది. మండలంలో దాదాపు 8 వేల ఎకరాల విస్తీర్ణంలో మామిడి తోటలు విస్తరించి ఉన్నాయి. అయితే ఒక్కశాతం కూడా నీలం కాపు కనిపించకపోవడం ఆశ్చర్యం కలిస్తోందని రైతన్నలు అంటున్నారు. ఇదిలా ఉండగా మామిడి పునాస రకంలో ఏడాదికి రెండుసార్లు తప్పనిసరిగా కాపుని స్తాయి. ఆ పునారస రకం చెట్లలో కూడా కాయలు కనిపించకపోవడం ఆశ్చర్యానికి తావిస్తుందంటున్నారు. మే నెల నుంచి పూత, పిందెలతో ప్రారంభమ య్యే పునాస కాపు



ఈ ఏడాది ప్రకృతి వైపరీత్యాల కారణంగా పూత పూర్తిగా మగ్గిపోగా కాపు కనిపించకుండా పోయింది. అందువల్ల పునారస సాగు చేసిన రైతన్నలు ఈ ఏడాది కనీసం పొలం ఖర్చులకన్నా ఆదాయం లభిస్తుందని అనుకున్నా అది కూడా నిరాశగానే మిగిలిపోయింది. ఇక ఈ ఏడాదికి మామిడి రైతన్నలకు పూర్తిగా నష్టం మిగిలిపోయింది. ఇదిలా ఉండగా మండలంలోని కొన్ని ప్రాంతాల్లో మామిడి సాగుపై ఆసక్తి సన్నగిల్లి తోటలను నరికేసే పరిస్థితి ఏర్పడింది. రానున్న రోజుల్లో మామిడి సాగు పరిస్థితి ఆగమ్యగోచరంగా తయారు కానుందని రైతులు నిట్టూర్చుతున్నారు. ఏదేమైనా పంటను నమ్ముకుని లక్షలు, కోట్ల రూపాయలు ఖర్చు పెట్టిన రైతులు, వ్యాపారులు బాగా దిగాలు తీసిన పరిస్థితి ఏర్పడింది. ఇదిలా ఉండగా ప్రభుత్వం వ్యవసాయాన్ని, ఉపాధి పథకాన్ని అనుసంధానం చేసి రైతులను కొంతవరకైనా ఆదుకోవాలని కోరుతున్నారు.

ఆదాయం పూర్తిగా ఆగిపోయింది



రెండేళ్ల నుంచి రైతుల దగ్గర మామిడికాయలు కొనుగోలు చేసి కమీషన్ ఏజెంట్‌గా వ్యాపారులకు కాయలు సరఫరా చేశాను. రెండేళ్లు ఏడాదికి సరఫరా ఖర్చులు లభించాయి. ఈ ఏడాది కూడా అదే ఆశతో కమీషన్ వ్యాపారం ప్రారంభించాను. అయితే కాయల కోసం ఎంత కష్టపడినా ఆశించిన మేర మండీకి కాయలు రాలేదు. ఫలితంగా బాగా నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. రెండేళ్లలో ఏడాదికి కనీసం 200 టన్నులైనా వ్యాపారులకు సరఫరా చేసేవాడిని. ఈ ఏడాది ఆ ఆశ లేకుండా పోయింది. అతి కష్టం మీద 20 టన్నులు కూడా పంపించలేని పరిస్థితి ఏర్పడింది. ఇలా జరుగు తుందని ఎప్పుడూ అనుకోలేదు. ముందు రోజుల్లో ఇలాగే ఉంటే కమీషన్ వ్యాపారం చేసుకునేందుకూ అవకాశం ఉండదు.

- పుచ్చకాయల రవిశంకర్,
కమీషన్ ఏజెంట్, ఈటమాపురం

కిలో మటన్ రూ.500

కడప, ప్రొద్దుటూరు నుంచి క్యూ కట్టిన మాంసం ప్రియులు
టోకెన్ సిస్టంతో మధ్యాహ్నం వరకూ తగ్గని జనం


మాంసం దుకాణాల వద్ద గుంపులుగా ఉన్న జనాలు

మైదుకూరు రూరల్ జూలై 14: మైదుకూరులో మాంసం ధరలు కొందరు వ్యాపారులు అమాంతం తగ్గించేశారు. ఒకరిపై ఒకరు పోటీగా మాంసం విక్రయాలు సాగించారు. దీంతో ప్రజలకు తక్కువ ధరలకే మాంసం రావడంతో భారీగా కొనుగోలు చేశారు. మాంసం విక్రయాలు మైదుకూరులో రోజు రోజుకూ వ్యాపారాలు పెంచుకుంటూ కిలో పొట్టేలు మాంసం ధర ఎనిమిది వందలు చేసేశారు. కాగా విక్రయాలు మందకొడిగా సాగుతూ వస్తున్నాయి. అయితే ఈ ఆదివారం కడప రోడ్డులోని కొందరు వ్యాపారులు కిలో మాంసం ధర కేవలం రూ.500లు చేసి విక్రయాలు సాగించారు. ఈ ఆఫర్‌తో మాంసం కోసం జనాలు తండోపతండాలుగా వచ్చి కొంటున్నారు. మైదుకూరు, చుట్టుపక్కల పల్లెల నుంచే కాకుండా ప్రొద్దుటూరు, కడప నుంచి కూడా చార్జీలు పెట్టుకుని వచ్చి మరీ కొనుగోలు చేశారు. దీంతో కొనుగోలుదారులకు టోకెన్ సిస్టం కూడా ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం రెండుల గంటల వరకు మాంసం అమ్మకాలు సాగించారు. మాంసం తక్కువ ధరకు అమ్మకంపై వ్యాపారిని వివరణ అడుగగా పెద్ద మొత్తంలో పొట్టేళ్లను కోస్తే ఎవరికైనా రూ.500 గిట్టుబాటవుతుందన్నారు. చికెన్ ధరలు కూడా ప్రొద్దుటూరు, కడప కంటే మైదుకూరులో ఎక్కువ ధరకు అమ్ముతున్నారని ప్రజలు వాపోతున్నారు. చికెన్, మాంసం ధరల విషయంలో మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

వ్యక్తిని గుర్తించండి


గుర్తు తెలియని వ్యక్తి

ప్రొద్దుటూరు క్రైం, జూలై 14: ఇతని వయస్సు 30 ఏళ్లు ఉంటాయని, ప్రభుత్వాస్పత్రిలో చేర్పించామని, వ్యక్తిని గుర్తించండి అని త్రీటౌన్ సీఐ వెంకటరమణ తెలిపారు. మద్యం తాగి మత్తులో ఉండడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో, అతన్ని ప్రభుత్వాస్పత్రిలో చేర్పించినట్లు ఆయన తెలిపారు. తన ఊరు నంద్యాల అని చెబుతున్నాడని సీఐ తెలిపారు. ఇతను ప్రభుత్వాస్పత్రిలో ఉన్నాడని, పూర్తి సమాచారం తెలిస్తే 9121100589కు తెలియజేయాలని ఆయన కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

రామాపురం, జూలై 14: కర్నూలు-చిత్తూరు 40వ జాతీయ రహదారిలోని రామాపురం మండలం చిట్లూరు పంచాయతీ పాలన్నగారిపల్లె వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో స్కూటర్, సుమో ఢీకొని నాగభాస్కర్ (45) అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి... చిట్లూరు గ్రామం పాలన్నగారిపల్లె వాసి నాగభాస్కర్ రోడ్డుపై నిలబడి ఉండగా కడప నుంచి రాయచోటి వైపు వెళ్తున్న స్కూటర్ అతన్ని ఢీకొని రాయచోటి వైపు వెళ్లిపోయింది. వెనుకవైపు నుంచి వచ్చిన సుమో అతని తలపై సుమో ఎక్కడంతో తల, మొండెం రెండు భాగాలైంది. దీంతో నాగభాస్కర్ అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనా స్థలానికి రామాపురం పోలీసులు కేసు నమోదు చేసుకుని, పోస్టుమార్టం నిమిత్తం రాయచోటి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఇమామ్ పీర్లు ఊరేగింపు


ఇమామ్ పీర్లను ఊరేగిస్తున్న దృశ్యం

చిన్నమండెం, జూలై 14: మఖాన్ వద్ద గురువారం నుంచి వైభవంగా సాగుతున్న మొహర్రం సందర్భంగా ఆదివారం పాతస్టేట్ బ్యాంక్ దగ్గర, మఖాన్‌లోని గంధం పీరు దగ్గర ఉన్న ఇమామ్ పీర్లను సొంత బజారులోని సంతూప్ వరకు ఊరేగించి తిరిగి ఆ పీర్ల స్థానంలో నిల్పోబెట్టారు. ఈ ఊరేగింపు సంప్రదాయ పద్ధతిలో మత గురువుల ప్రార్థనలతో వైభవంగా సాగింది. శనివారం రాత్రి పాత స్టేట్‌బ్యాంక్ దగ్గర ఉన్న అగ్నిగుండాలను భక్తిశ్రద్ధలతో కాల్చారు. ఆదివారం రాత్రి పీర్ల మఖాన్ దగ్గర ఉన్న రెండు అగ్నిగుండాలను కాలుస్తారని మొహర్రం కమిటీ సభ్యులు తెలిపారు. గంధపు పీరును దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి


మృతురాలు రాజమ్మ (ఫైల్ ఫొటో)

పెద్దతిప్పసముద్రం జూలై 14: అనుమానాస్పద స్థితిలో రాజమ్మ(48) శనివారం రాత్రిమృతి చెందింది. పీటీఎం ఎస్ఐ రవీంద్రబాబు కథనం మేరకు పీటీఎం మండలం మద్దయ్యగారిపల్లె పంచాయతీ బురుజుపల్లె వాసి గంగులప్ప భార్య రాజమ్మ శనివారం గ్రామ శివారులోని పొలాల్లోకి వేపగింజలు ఏరుకునేందుకు వెళ్లిందన్నారు. ఆ సమయంలో అదే గ్రామస్తుడు ఆదెప్ప తమ పొలంలో వేప గింజలు ఎలా ఏరుతావా అంటూ ఆమెపై దాడికి పాల్పడినట్లు తెలి సిందన్నారు. కాగా ఆదివారం ఉదయం రాజమ్మ మృతి చెందినట్లు సమాచారం రావడంతో పీటీఎం పోలీసులతో కలిసి బురుజుపల్లెకు చేరుకుని మృతదేహాన్ని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. కాగా పోస్టుమార్టం రిపోర్టు వస్తేగాని ఆమె మృతికి గల కారణాలు తెలుస్తాయని ఎస్ఐ రవీంద్ర బాబు తెలిపారు.

ఆవు పొడవడంతో పదిమందికి తీవ్ర గాయాలు

ఆవులను బంధించిన మున్సిపల్ సిబ్బంది

ప్రొద్దుటూరు, జూలై 14: ఆవు మనుషులపై దాడిచేస్తూ పదిమందికి పైగా తీవ్రంగా గాయపరిచింది. ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో ఎక్కడ చూసినా ఆవులు గుంపులు దర్శన మిస్తున్నాయి. ఆవుల యజమానులు వాటిని రోడ్లపైకి వదలడం వలన ప్రజలు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శనివారం రాత్రి గవిని సర్కిల్ ఆదర్శనగర్ దగ్గర నుంచి ఎల్ఐసీ కార్యాలయం వరకు ఒక ఆవు పది మందికి పైగా తీవ్రంగా గాయపరిచింది. దీంతో కొందరు ప్రైవేటు ఆస్పత్రికి చికిత్సకోసం వెళితే మరికొందరు ప్రభుత్వ ఆస్పత్రిలో చేరారు. ఓ మహిళలను ఆవు కొమ్ములతో ఎత్తి కింద వేయడంతో ఆమెకు తీవ్ర గాయాలై చెయ్యి విరిగింది. ఆవు బీభత్సంపై పోలీసులకు మున్సిపల్ అధికారులకు ఫోన్ చేశారు. దీంతో మున్సిపల్ శానిటరీ అధికారులు సిబ్బంది వల వేసి ఆవును బంధించారు. తరువాత క్రేన్ సహాయంతో దానిని ట్రాక్టర్‌లో వేసి బయటికి తరలించారు. ఆవులను యజమానులు తమ గృహాల్లో పెంచుకోవాలని తెలిపారు.

విద్యుత్‌షాక్‌తో కౌలు రైతు మృతి

సిద్దవటం, జూలై 14: నేకనాపురం వాసి, కౌలు రైతు కొండా పాలకొండయ్య విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. ఆదివారం ఉదయం భార్య నీలమ్మతో పసుపు పంటకు నీరు పెట్టేందుకు పొలానికి వెళ్లి స్టాటర్ ఆన్ చేస్తుండగా స్టాటర్ నుంచి విద్యుత్ ప్రసారమై అక్కడికక్కడే కుప్ప కూలిపోయాడు. భార్య వేసిన కేకలతో స్థానికులు పరిశీలించి మృతిచెందాడని తెలిపారు. మృతుని భార్య ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ శ్రీనివాసులు తెలియజేశారు.

బీజేపీకి ఘోరపరాభవం : తులసిరెడ్డి


వేంపల్లెలో నిరుపయోగంగా ఉన్న చెత్త సంపదకేంద్రాన్ని చూపుతున్న తులసిరెడ్డి

వేంపల్లె, జూలై 14: దేశంలోని ఏడు రాష్ట్రాల్లో జరిగిన అసెంబ్లీ ఉప ఎన్నికల్లో బీజేపీకి ఘోరపరాభవం జరిగిందని కాంగ్రెస్ సీనియర్ నేత తులసిరెడ్డి అన్నారు. దేశంలో మారుతున్న రాజకీయ పవనాలకు ఇది ఒక సంకేతమన్నారు. ఈ ఏడాది చివరిలో నాలుగు రాష్ట్రాల్లో జరిగే ఎన్నికల్లో ఇదే ఫలితాలు పునరావృతమై ఇండియా కూటమి గెలుస్తుందన్నారు. ఈ ఏడాది చివరిలో జరిగే నాలుగు రాష్ట్రాల ఎన్నికల తర్వాత మోదీ ప్రభుత్వం కూలిపోతుందన్నారు. స్వచ్ఛ భారత్ మిషన్ కింద గతంలో రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీల్లో ఏర్పాటు చేసిన చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాలను ఉపయోగంలోకి తీసుకురావాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. వైసీపీ ప్రభుత్వ నిర్వాకంతో చెత్త సంపద తయారీ కేంద్రాలు మూలన పడ్డాయని, పర్యవసానంగా పారిశుద్ధ్యం పడకేసిందన్నారు. ఇప్పటికే ఉన్న కేంద్రాలను ఉపయోగించి మళ్లీ పారిశుద్ధ్యం మెరుగు, సంపదనుపెంపొందించాలని ఆయన సూచించారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రతిపక్షపాత్ర పోషించాల్సిన వైసీపీ బీజేపీ చేతిలో కీలుబొమ్మగా మారిందన్నారు. ఇటీవల లోక్‌సభ ఎన్నిక సందర్భంగా వైసీపీ బీజేపీకి మద్దతు ఇచ్చిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్ర పోషిస్తుందని ఐదేళ్ల తర్వాత వచ్చే ఎన్నికల్లో దేశంలోను,రాష్ట్రంలోను కాంగ్రెస్ పార్టీ అధికారం చేజిక్కించుకునేందుకు కృషిచేస్తుందన్నారు.

ప్రాణాలు పోతేగాని పట్టించుకోరా..?

● విద్యుత్ స్తంభం మార్చే తీరిక లేదా? ● షాక్ కొట్టేంత వరకు స్పందించరా.. ● అస్తవ్యస్తంగా విద్యుత్ లైన్లు.. ● ఆందోళనలో ప్రజలు

చెన్నూరు, జూలై 14:మేజరు గ్రామ పంచాయతీ చెన్నూరులో ఇప్పటికీ ఇనువ విద్యుత్ స్తంభాలు ఉన్నాయి. వాటి పక్కన సిమెంటు స్తంభాలు ఏర్పాటు చేసి విద్యుత్ తీగలు మార్చాలని ప్రజలు పదే పదే కోరుతున్నా ఇప్పటికీ వారి సమస్యలు పట్టించుకునే నాథుడే లేడు. చాలా కాలంగా చెన్నూరు వనంవీధిలో ఓ ఇనుప విద్యుత్ స్తంభం పక్క సిమెంటు విద్యుత్ స్తంభం ఏర్పాటు చేశారు. ఆ స్తంభానికి ప్రస్తుతం ఉన్న విద్యుత్ లైన్లను మార్చాల్సి ఉంది. అయితే ఆ ప్రాంత ప్రజలు పదే పదే కోరుతున్నా విద్యుత్ శాఖ సి బ్బంది ఆ దిశగా దృష్టి సారించలేదు. దీంతో వనంవీధి ప్రజలు విద్యుత్ శాఖ సిబ్బంది పనితీరుపై తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. చాలా కాలంగా ఓ ఇనుప విద్యుత్ స్తంభం వల్ల ప్రమా దం ఉందని, దానిని మార్చివేయండని పదే పదే కోరినా ఎందుకు పట్టించుకోవడంలేదని, షాక్ కొట్టి ప్రమాదం జరిగితే తప్ప పట్టించుకోరా అన్న విమర్శలు చోటు చేసుకుంటున్నాయి. పైగా ఇదే ప్రాంతంలో విద్యుత్ తీగలు సక్రమంగా లేవు. తెగిపోవడంతో వాటిని మడతపెట్టి చుట్టి ఉంచారు. కొన్ని చోట్ల మడతపెట్టి, మరికొన్ని చోట్ల వేలాడుతున్నా వాటిని పట్టించుకోకుండా అలాగే ఉంచారు. వాటిని కూడా తీసి కొత్త లైన్లు ఏర్పాటు చేయాలని కోరితే విద్యుత్ సిబ్బంది మాత్రం వాటి వల్ల ప్ర మాదం లేదు, ఏ ఇబ్బందీ ఉండదు అని చెబుతున్నారు తప్ప వారు చేసింది శూన్యమే. దీంతో ప్రమాదకరంగా ఉన్న ఆ విద్యుత్ స్తంభం వద్దకు వెళ్లినప్పుడల్లా ఆ ప్రాంత ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ముఖ్యంగా చిన్న పిల్లలు ఎవరినీ ఆ ప్రాంతం వద్దకు వెళ్లవద్దని పదే పదే హెచ్చరి స్తున్నారు. ప్రస్తుత వర్షాకాలంలో విద్యుత్ స్తంభం వల్ల ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యులని పలువురు ప్రశ్నిస్తున్నారు.





వేలాడుతున్న విద్యుత్ తీగ... తెగిపోయిన విద్యుత్ తీగలు చుట్టిన దృశ్యం

ఎన్నిమార్లు చెప్పినా నిర్లక్ష్యమే



ఇనుప విద్యుత్ స్తంభాన్ని మార్చి సిమెంటు స్తంభం ఏర్పాటు చేయాలని కోరా. కానీ ఆ సిమెంట్ స్తంభానికి కనెక్షన్ ఇవ్వడం మాత్రం మరిచారు. విద్యుత్ లైన్లను మారిస్తే ప్రాణాపాయం ఉండదు. ప్రమాదాలు జరగవు. అని పదే పదే చెప్పినా కరెంటోళ్లు పట్టించుకుంటే కదా, పొరపాటున ఏదైనా జరిగితే ఆ రోజు మాత్రం కరెంటు సిబ్బందిని ఎవరినీ వదలం. ఇప్పటికైనా ఇనుప విద్యుత్ స్తంభానికి ఉన్న వైర్లను సిమెంటు స్తంభానికి మార్చాలి. లేదంటే ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తాం.

- కుందేటి క్రిష్ణయ్య, వార్డుసభ్యుడు, చెన్నూరు



చెన్నూరు వనం వీధిలో విద్యుత్ తీగలు ఉన్న ఇనుప విద్యుత్ స్తంభం పక్కనే ఉన్న సిమెంటు స్తంభం

'వైవీయూలో అవినీతిపై విచారణ చేపట్టాలి'

కడప (ఎర్రముక్కపల్లె), జూలై 14 :గత వైసీపీ ప్రభుత్వంలో వైవీయూ లో జరిగిన అవినీతి, అక్రమాలప ప్రభుత్వం విచారణ చేపట్టాలని వైవీయూ రాష్ట్ర అధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం కడప నగరం ఆర్‌ఎస్‌యూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అర్హత లేకపోయినా వీసీ పదవులు వైసీపీకి అనుకూలమైన వారికి ఇచ్చారన్నారు. యూనివర్సిటీలను అభివృద్ధి చేయాల్సిన అధికారులు వాటిని రాజకీయ పునరావాస కేంద్రాలుగా మార్చుకున్నారన్నారు. యూనివర్సిటీల పాలక మండలిలో కూడా అర్హత లేని వ్యక్తులను నియమించారని, రాజ్యాంగబద్ధమైన వైస్ చాన్సరల్ పదవులు వైసీపీ పాలనలో అపహాస్యం చేశారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని యూనివర్సిటీల్లో ఇదే పరిస్థితి నెలకొందన్నారు. తక్షణం ప్రభుత్వం జోక్యం చేసుకుని దీనిపై విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని, అలాగే పరిపాలనను గాడిలో పెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్‌యు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రశాంత్, చెన్నకేశవరెడ్డి, హరిబాబు పాల్గొన్నారు.

ఆర్‌సీడీఎస్‌కు ఆర్థిక సాయం

పులివెందుల రూరల్, జూలై 14: రెడ్డి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీకి (ఆర్‌సీడీఎస్) రూ.15116 ఆర్థిసాయం అందినట్లు సొసైటీ అధ్యక్షుడు సురేంద్రరెడ్డి తెలిపారు. ఆదివారం పులివెందుల మార్కెట్ యార్డు మాజీ వైస్‌చైర్మన్ సర్వోత్తమరెడ్డి ఈ ఆర్థికసాయాన్ని అందించారన్నారు. ఆర్‌సీడీఎస్ రాయలసీమ కన్వీనర్ జగదీశ్వర్ రెడ్డి, రాష్ట్రమహిళా అధ్యక్షురాలు శ్రీలతరెడ్డి, జాతీయ కన్వీనర్ వెంగళరెడ్డి ఉన్నారు.

అధికారులు వెంటనే
మెడికల్ క్యాంపులు నిర్వహించాలి: డీవైఎఫ్ఐ

కడప (సెవెన్‌రోడ్స్), జూలై 14 : ప్రస్తుతం డయేరియా ప్రబలుతున్న నేపథ్యంలో వైద్యశాఖ అధికారులు జిల్లాలో రెగ్యులర్ మెడికల్ క్యాంపులు నిర్వహించాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ తెలిపారు. ఆదివారం స్థానిక ఆర్టీసీ బస్టాండు వద్ద ఉన్న జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం వాతావరణ పరిస్థితుల్లో మార్పు, దోమల వల్ల డయేరియా విజృంభిస్తుందన్నారు. జిల్లాలో డయేరియా వల్ల ప్రజలు నిత్యం ఆస్పత్రిపాలవుతున్నారన్నారు. ఇదే అదనుగా చూసుకుని ప్రైవేటు ఆసుపత్రి యాజమాన్యాలు ప్రజల వద్ద విపరీతంగా ఫీజులు వసూలు చేస్తున్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలు ఆర్ఎంపీలు ఇష్టానుసారంగా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వైద్యం చేస్తున్నారన్నారు. డయేరియాతో మరణాలు కూడా సంభవిస్తున్నాయన్నారు. కొద్ది రోజుల క్రితం ఖాజీపేటలో ఒకరు చనిపోయారని గుర్తు చేశారు. దోమల నివారణకు రెగ్యులర్‌గా ఫాగింగ్ నిర్వహించాలని జిల్లా అధికార యంత్రాంగాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నగర ఉపాధ్యక్షుడు విజయ్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మకు ఘనంగా పూజలు



సీకేదిన్నె, జూలై 14: చింత కొమ్మ దిన్నె మండలం కొత్తపేట గంగమ్మ తల్లికి భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆదివారం అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కోరిన కోర్కెలు నెరవేరడంతో భక్తులు అమ్మవారికి వారి శక్తి మేరకు కానుకలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సమీపంలోని వీరభద్రస్వామి, ఆంజనేయస్వామి, అక్కదేవతల ఆలయాల్లో పూజలు నిర్వహించి బంధుమిత్రులతో కలిసి విందు భోజనాలు ఏర్పాటు చేసుకుని అమ్మవారి సన్నిధిలో ఆరగించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

సీకేదిన్నె, జూలై 14: రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలైనట్లు సికెదిన్నె పోలీసులు తెలిపారు. గువ్వల చెరువు నుంచి పాలకోవా అమ్ముకునేందుకు ఆటోలో కడపకు వస్తున్న దర్బార్ మూలవంక బ్రిడ్జి వద్ద వెనుకవైపు నుంచి కారు వచ్చి ఢీకొంది. దీంతో దర్బార్‌కు గా యాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

దళితుడిపై హత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేయాలి

● డీహెచ్‌పీఎస్ డిమాండ్

కడప (ఎర్రముక్కపల్లె), జూలై 14 :ఒంటిమిట్ట మండలం పెన్నపేరూరు గ్రామానికి చెందిన కదిరి ప్రభాకర్ అనే దళితుడిపై హత్యాయ త్నానికి పాల్పడిన వెంకటసుబ్బారెడ్డి అనే వ్యక్తిపై వెంటనే ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి కె.మునెయ్య, చంద్రగుప్త, టీడీపీ దళిత నగర ఉపాధ్యక్షుడు కొండా సుబ్బయ్య డిమాండ్ చేశారు. ఆదివారం రిమ్స్‌లో చికిత్స పొందుతున్న ప్రభాకర్‌ను వారు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కదిరి ప్రభాకర్‌పై అగ్రకులస్తుడైన వెంకటసుబ్బారెడ్డి కులం పేరుతో దూషించి దాడి చేయడమే కాకుండా మరుగుతున్న నూనె తీసుకుని అతని ఒంటిపై పోసి హత్యాయత్నం చేయడం దారుణమైన చర్య అన్నారు. డీహెచ్‌పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

కఠిన చర్యలు తీసుకోవాలి

కడప (ఎడ్యుకేషన్), జూలై 14: దళితుడు ప్రభాకర్‌పై వేడి నూనె పోసి హత్యాయత్నానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ఎఫ్‌బీపీ రాష్ట్ర కార్యదర్శి జయవర్ధన్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీ మాల కులానికి చెందిన కదిరి ప్రభాకర్ అగ్రకులానికి చెందిన వారి ఇంటి అరుగుపై కూర్చున్నాడని గజ్జల వెంకటసుబ్బారెడ్డి వేడి నూనె పోసి హత్యాయత్నానికి పాల్పడడం దుర్మార్గమన్నారు. వెంటనే అతనిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.



కదిరి ప్రభాకర్‌ను పరామర్శిస్తున్న డీహెచ్‌పీఎస్ ప్రతినిధులు

అలాగే బాధితునికి మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు.

దాడిచేసిన వారిని అరెస్టు చేయాలి: సీపీఎం

కదిరి ప్రభాకర్ అనే వ్యక్తిపై వేడి వేడి ఆయిల్‌తోదాడి చేసిన వారిపై ఎస్సీ ఎస్టీ 307 క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సీపీయం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ తెలిపారు. ఆదివారం కడప రిమ్స్ హాస్పిటల్‌లో దాడికి గురైన కదిరి ప్రభాకర్‌ను పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు దస్త గిరిరెడ్డి, ఒంటిమిట్ట మండలం సీపీఎం కార్యదర్శి కోనేటి నరసయ్య, సిద్దవటం మండల కార్యదర్శి సురేశ్ పాల్గొన్నారు.

కఠినంగా శిక్షించాలి: జైభీమ్

కడప (ఎడ్యుకేషన్), జూలై 14 : ప్రభాకర్ అనే వ్యక్తిపై కుల వేడినూనె పోసి హత్యాయత్నం చేసిన వ్యక్తిని వెంటనే శిక్షించాలని జైబీమ్ మా లమహాసేన అధ్యక్షుడు పల్లెకొండు సంపత్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం జైబీం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ దళితుల రక్షణకు ఎన్ని చట్టాలు తెచ్చినా కూడా ఇంకా దళితులపై దాడులు జరుగుతునే ఉన్నాయన్నారు. ఎస్సీఎస్టీ హక్కుల పరిరక్షణ ఉపాధ్యక్షుడు శేఖర్, జైబీం మాలమహాసేన ప్రధాన కార్యదర్శి చైతన్య పాల్గొన్నారు.

దళితులకు రక్షణ కల్పించాలి: ఆర్పీపీ

కడప (సెవెన్‌రోడ్స్), జూలై 14 : దళితుడైన కదిరి ప్రభాకర్‌పై వేడి వేడి నూనెను పోసిన చిన్నప్పగారి గజ్జల వెంకటసుబ్బారెడ్డిని చట్టపరంగా శిక్షించాలని ఆర్పీపీ నగర కార్యదర్శివర్గ సభ్యుడు మడగలం ప్రసాద్, ఓబిలి విజయకుమార్ డిమాండ్ చేశారు. చికిత్స పొందుతున్న కదిరి ప్రభాకర్‌ను వారు పరామర్శించారు. ప్రభాకర్ కుటుంబానికి నష్టపరిహారంగా రూ.25 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

దళితుల పట్ల వివక్ష బాధాకరం

కడప (మారుతీనగర్), జూలై 14: దళితుల పట్ల నేటికీ వివక్ష కొనసాగడం బాధాకరమని జై భారత్ ఎస్సీ పోరాట వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొల్లపల్లి గురవయ్య పేర్కొన్నారు. ఆదివారం గురవయ్య రిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఆయన్ను పరామర్శించి మాట్లాడారు.

టీటీడీలో ఇంకా పాత ప్రభుత్వ ఛాయలు: ఎమ్మెల్యే

తిరుమల/కడప (ఎర్రముక్కపల్లె), జూలై 14: టీటీడీలో ఇంకా పాత ప్రభుత్వ ఛాయలు కనిపిస్తున్నాయని కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి అన్నారు. తిరుమల శ్రీవారిని ఆదివారం ఆమె భర్త, పొలిట్ బ్యూరో సభ్యు డు శ్రీనివాసరెడ్డితో కలిసి దర్శించుకున్న ఆమె ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. టీటీడీలోని ప్రతి వ్యవస్థను అవినీతిమయం చేశారన్నారు.పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయాల్సిన అవసరముందని చెప్పారు. స్వామి దర్శనం చేసుకున్న తర్వాత ఇచ్చే అన్నప్రసాదాల నాణ్యత పూర్తిగా పోయిందని పేర్కొన్నారు. అధికారుల దృష్టికి తీసుకెళితే ఆర్గానిక్ అని నచ్చజెబుతున్నారని తెలిపారు. పాత ప్రభుత్వ ఛాయలను ఆలయం నుంచి బయటకు పంపాల్సిన అవసరముందన్నారు. అన్నప్రసాదాల నాణ్యతపై అధికారులకు లేఖ రాస్తామని ఆమె పేర్కొ న్నారు. నూతన ప్ర భుత్వం ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తుందన్నారు. మాధవీరెడ్డి కుటుంబ సభ్యులు టీడీపీ యువ నాయకులు రెడ్డప్పగారి శ్రవణ్‌రాజ్‌రెడ్డి, రెడ్డప్పగారి శ్రీయాంకరెడ్డి పాల్గొన్నారు.



తిరుమల వెంకన్న సేవలో మాధవి, శ్రీనివాసరెడ్డి

'వైద్యులపై దాడులు ఆపాలి'

కడప (సెవెన్‌రోడ్స్), జూలై 14: వైద్యులపై దాడులు ఆపాలని ఏపీ జూడో కడప అధ్యక్షుడు డాక్టర్ ఖదీర్ అహ్మద్,ఉపాధ్యక్షుడు డాక్టర్ అశ్విని, ప్రధాన కార్యదర్శి డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి డాక్టర్ మణి దీపక్ డిమాండ్ చేశారు. ఆదివారం కడపలో ప్రభుత్వ వైద్యశాల ఏపీ జూడా సభ్యులు, పోస్టు గ్రాడ్యుయేట్‌లు, జూనియర్ డాక్టర్లు ని రసన తె లిపారు. వారికి మూడు నెలలుగా ఉపకార వేతనం అందడంలేదన్నారు. ఈ మేరకు ఏపీ జూడా కడప సభ్యులు రాష్ట్ర కమిటీకి మద్దతు అందించారు.



నిరసన తెలుపుతున్న జూడాలు

తక్షణం టెండర్లు పిలవాలి: ఏఐటీయూసీ

కడప (సెవెన్‌రోడ్స్), జూలై 14: పౌరసరఫరాల శాఖలో రద్దయిన బియ్యం టెండర్లను మళ్లీ నిర్వహించాలని ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ బాదుల్లా విజ్ఞప్తి చేశారు. ఆదివారం స్థానిక హోచిమన్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో సివిల్ సప్లై విభాగంలో బియ్యం రవాణా వాహనాలకు అద్దె చెల్లింపులో డిపార్ట్‌మెంట్ పేరు చెప్పి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. గత మూడు నెలల కాలంలో ముగ్గురు కాంట్రాక్టర్లను మార్చిన ఘనత సివిల్ సప్లై అధికారులకే దక్కుతుందన్నారు. ఏఐటీ యూసీ నగర అధ్యక్షుడు పి.సుబ్బరాయుడు పాల్గొన్నారు.

బిట్స్ బుక్‌లెట్ ద్వారా ఉత్తీర్ణత సులభతరం

కడప (ఎర్రముక్కపల్లె), జూలై 14 : డిపార్ట్‌మెంటు పరీక్షలకు సంబంధించి ఏపీటీఎఫ్ అమరావ తి రూపొందించిన బిట్స్ బుక్‌లెట్ ద్వారా ఉత్తీర్ణత సులభతరమని జేఏసీ జిల్లా చైర్మన్ శ్రీనివాసులు, ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ సీవీ ప్రసాద్, ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శివార్జున తెలిపారు. ఆదివారం కడప ఎన్జీఓ భవన్‌లో డిపార్ట్‌మెంటు పరీక్షల బిట్ బుక్‌లెట్‌ను వారు విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ డిపార్ట్‌మెంటు పరీక్షలకు ఉద్యోగ ఉపాధ్యాయులకు చాలా కీలకమన్నారు. ఉత్తీర్ణత సులభతరం అయ్యే విధంగా ఏపీటీఎఫ్ అమరావతి ఆధ్వర్యంలో బిట్స్ బుక్‌లెట్ తీసుకురావడం సంతోషమన్నారు. డిపార్ట్‌మెంట్ పరీక్షల ఉత్తీర్ణతతో పదోన్నతులు ఇంక్రిమెంట్లు పొందేందుకు వీలుందన్నారు. ఏపీటీఎఫ్ నాయకులు ఉమాకాంత్, వెంకటసుబ్బయ్య, వీరప్రసాద్, సుబ్బయ్య పాల్గొన్నారు.



బిట్స్ బుక్‌లెట్ విడుదల చేస్తున్న ప్రతినిధులు

వైవీయూకు వెంటనే వీసీ, రిజిస్ట్రార్‌ను నియమించాలి

● ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వలరాజు

కడప (ఎర్రముక్కపల్లె), జూలై 14 :వైవీయూకు వెంటనే వైస్‌చాన్సలర్ రిజిస్ట్రాలను నియమించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.వలరాజు డిమాండ్ చేశారు. ఆదివారం కడప నగరం హోచిమన్ భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ యూనివర్సిటీల్లో 20కి పైగా పీజీ కోర్సులు, పరిశోధనలు, జిల్లా వ్యాప్తంగా డిగ్రీ, లా, బీఈడీ,. ఒక ఇంజనీరింగ్ కాలేజీ ఇలా అనుబంధంగా అనేక కళాశాలలు ఉన్నాయన్నారు. వాటి పరిపాలన సజావుగా సాగాలంటే ప్రతిరోజూ వైస్‌చాన్సలర్, రిజిస్ట్రార్లు ఉంటేనే సాధ్యమవుతుందన్నారు. ప్రస్తుతం విద్యావ్యవస్థ గాడి తప్పిందని, దీనికి తోడు గత వైస్ చాన్సలర్, రిజిస్ట్రార్ చేసిన అవినీతి అక్రమాల వల్ల ఇప్పటికే వర్సిటీ దెబ్బతిందన్నారు. ప్రభుత్వం వెం టనే స్పందించి రెగ్యులర్ వైస్‌చాన్సలర్, రిజిస్ట్రార్లను నియమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి శివశంకర్, అఖిరానంద్, తేజ, అశోక్, చంద్ర, వాహిద్, రాజేశ్, నిఖిల్ పాల్గొన్నారు.

జీపీఎస్ అమలుపై ఇచ్చిన గెజిట్‌ను ప్రభుత్వం రద్దు చేయాలి: ఏపీటీఎఫ్

కడప (ఎర్రముక్కపల్లె), జూలై 14 :జీపీఎస్ ఉద్యోగులకు జీపీఎస్ విధానం అమలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవోను తక్షణం రద్దు చేయాలని ఏపీటీఎఫ్ (1938)అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బత్తల రాజు, రాళ్లపల్లె అబ్దుల్లా డిమాండ్ చేశారు. ఆదివారం జీపీఎస్ రద్దు చేయాలని కోరుతే నిరసన చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతే గత ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయులకు వారం రోజుల్లో సీపీఎస్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక ఉద్యోగులను విస్మరించి జీపీఎస్ అమలుపరచడానికి పూనుకోవడం దుర్మార్గమన్నారు. దీనిపై గత ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకుందని అన్నారు. జీపీఎస్‌కు సంబంధించి రాజపత్రాన్ని విడుదల చేయకుండా తాత్కాలికంగా ఆపివేయడం జరిగిందని, ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వం చేసిన తప్పిదాలు చేయడానికి పూనుకుందన్నారు.వెంటనే ప్రభుత్వం దీనిపై రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వీరాంజనేయరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు ఖాసింవలి, ఎస్.రమేశ్‌బాబు, నాగరాజు పాల్గొన్నారు.



నిరసన కార్యక్రమంలో ఏపీటీఎఫ్ ప్రతినిధులు

రెగ్యులర్ ఉద్యోగులతో పనిచేయించాలి

వేంపల్లె, జూలై 14: వేంపల్లె మేజర్ పంచాయతీలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న హరికృష్ణ మరో ఇద్దరు రెగ్యులర్ బిల్‌కలెక్టర్లను ఖాళీగా కూర్చోబెట్టకుండా పనిచేయించాలని బీజేపీ జిల్లా కార్యదర్శి గాలి హరిప్రసాద్ పంచాయతీ ఈఓకు సూచించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత కొద్ది నెలలుగా రెగ్యులర్ ఉద్యోగులను ఖాళీగా కూర్చోబెట్టి వేతనాలు ఇస్తున్నారని, వారిపనిని ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించారని తెలిపారు. ప్రజాధనాన్ని వృథాగా ఉద్యోగులకు ఇవ్వడం మంచిదికాదన్నారు. గతంలో అవినీతి ఆరోపణలువచ్చిన జూనియర్ అసిస్టెంట్ హరికృష్ణపైపూర్తిస్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు సుష్మ, బీజేవైఎం కార్యవర్గ సభ్యులు సునీల్‌కుమార్, ప్రసాద్‌రెడ్డి, చరణ్ పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న గాలి హరిప్రసాద్

'విద్యార్థులకు వెసులుబాటు కల్పించాలి'

కడప (ఎర్రముక్కపల్లె), జూలై 14 :ప్రీ ప్రైమరీ స్కూలు నుంచి 12వ తరగత వరకు పాఠశాలలు తమకు నచ్చిన భారతీయ భాషను బోధనామాధ్యంగా ఎంపిక చేసుకునే వెసులుబాటును సీబీఎస్ఈ ఇటీవల కల్పించిందని, అయితే విద్యార్థులకు వారు కోరిన మాధ్యమంలో చదువుకునే వెసులుబాటు కల్పించాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకల శివార్జున తెలిపారు. ఆదివారం ఎస్సీ, ఎస్టీ ఉద్యాయ సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇంగ్లీషు మీడియంతో పాటు తెలుగు మీడియం కూడా ప్రవేశపెట్టాలన్నారు. విద్యార్థులు మాతృభాషలో చదవడం వల్ల వారిలో ఉన్న నైపుణ్యాలు బయటపడతాయన్నారు. కేవలం ఇంగ్లీషు మీడియం మాత్రమే ప్రవేశపెట్టడం వల్ల సగటు విద్యార్థులకు సగటు కంటే తక్కువ ప్రజ్ఞ గల విద్యార్థులకు అన్యాయం చేసినట్లవుతుందన్నారు. విద్యార్థులు వారి మాతృభాషను మాధ్యమంగా తీసుకుని చదివితే విద్యలో రాణించే అవకాశం పుష్కలం గా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ పి.శేషగిరిరావు, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సుదర్శనబాబు, గంగరాజ్, కట్టా గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం వేడుకలు

కమలాపురం రూరల్, జూలై 14 : మొహర్రం పండుగను పురస్కరించుకుని పట్టణంలోని కుళాయి స్వామి దర్గాతో పాటు కె,అప్పాయపల్లెలో వేడుకగా మొహర్రం వేడుకలు ప్రారంభం అయ్యాయి. మొహర్రం పండుగ సందర్భంగా ముస్లిం హిందూ కలిసి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తారు. గత మూడురోజులుగా ఈ ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. నగర పంచాయతీతో పాటు మండల పరిధిలోని చిన్నచెప్పలి, పెద్దచెప్పలి, గోపులాపురం, తురకపల్లె, విభరాపురం తదితర గ్రామాల్లో పీర్లచావిడి వద్ద పీర్లను అలంకరించి మేళతాళాలతో భక్తిశ్రద్ధలతో బాణసంచా కాలుస్తూ ఉత్సవాలు నిర్వహించారు. హిందూ ముస్లింలు పీర్లను దర్శించుకుని చక్కెర చదివింపులు నిర్వహించారు. సాయంత్రం దర్గా ఆవరణంలో మేళతాలాలతో కార్యక్రమం నిర్వహించారు.

ఆంధ్ర క్రికెట్‌లో చక్రాయపేట సుదర్శన్ ప్రతిభ

చక్రాయపేట, జూలై 14: పులివెందుల నియోజకవర్గం చక్రాయపేట మండలంలోని మహదేవపల్లె గ్రామానికి చెందిన కొడవాండ్లపల్లె సుబ్బరాయుడు కుమారుడు సుదర్శన్ ఆంధ్ర క్రికెట్ టీంలో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఇటీవల ఆంధ్ర జట్టుకి ఎంపికై శనివారం జరిగిన ఆటలో అత్యధిక స్కోర్, వికెట్ తీశాడు. ఈ సందర్భంగా ఆంధ్ర టీం అసోసియేషన్ సుదర్శన్‌ని అభినందించడమే కాకుండా రూ.లక్ష చెక్కు, అవార్డులు అందుకున్నాడు. ఎలాంటి సపోర్ట్ లేకపోయిన, క్రికెట్ నేపథ్యం లేకపోయినా ఆంధ్రజట్టుకు ఎంపికై మండలం మరియు గ్రామం పేర్లను రాష్ట్రస్థాయిలో నిలబెట్టిన సుదర్శన్‌కు ప్రజలు అభినందనలు తెలిపారు.



అవార్డు అందుకుంటున్న కొడవాండ్లపల్లె సుదర్శన్

ఆరోగ్యమాత వద్ద పనిచేసే భాగ్యం కలగడం నా అదృష్టం

● ఆరోగ్యమాత నూతన సహాయ డైరెక్టరుగా మహేశ్

కడప (నాగరాజుపేట), జూలై 14 : ఆరోగ్యమాత పుణ్యక్షేత్రం మరియమాత సన్నిధిలో పని చేసే భాగ్యం లభించడం తనకెంతో అదృష్టమని నూతన సహాయ డైరెక్టరు రెవరెండ్ ఫాదర్ పిల్లి మహేశ్ అన్నారు. ఆదివారం ఆరోగ్యమాత పుణ్యక్షేత్ర కార్యాలయంలో శాంతి సేవా సొసైటీ స్వచ్ఛంద సేవాసంస్థ బృందం గౌరవప్రదంగా ఆయన్ను కలిసి శాలువాతో, పూలమాలలతో సత్కరించి స్వాగతం పలిపారు. ఈ సందర్భంగా పిల్లి మహేశ్ మాట్లాడుతూ కడప అపోస్తులికా పాలన అధికారి రెవరెండ్ డాక్టర్ బిషప్ గాలిబాలి ఆదేశాల మేరకు నెల్లూరు మేత్రాసనం నుంచి రాయలసీమకే తలమానికంగా అయిన కడప వేళాంగిణి ఆరోగ్యమాత పుణ్యక్షేత్రంలో సేవలు చేయడానికి తనను నియమించడం తనకు దక్కిన భాగ్యమన్నారు. శాంతిసేవా సొసైటీ వ్యవస్థాపకుడు మడగలం ప్రసాద్, మనోహర్, స్రవంతి, అమృత, సుధాకర్, వినీత్, పావని, రత్నకుమారి పాల్గొన్నారు.



మహేశ్‌తో శాంతి సేవా సొసైటీ సేవా సంస్థ బృందం

గ్రామాల్లో వేడుకగా చిన్న సరిగెత్తు


టంగుటూరులో ఊరేగుతున్న బాబా ఫకృద్దీన్ పీరు

కొండాపురం, జూలై 14: మొహర్రం సందర్భంగా మండలంలోని చౌటిపల్లె గ్రామంలో ఆదివారం చిన్నసరిగెత్తు నిర్వహించారు. మంగళవారం పెద్దసరిగెత్తు జరుగుతుందని, ఈ సందర్భంగా పీర్లు అగ్నిగుండ ప్రవేశం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. బుధవారం పీర్లను ఏటికి తీసుకెళ్లనున్నట్లు వారు తెలిపారు.

పోరుమామిళ్ల: మొహర్రం సందర్భంగా పోరుమామిళ్లలోని ఉద్దికట్టవీధి, ఉసేన్‌పీర్ దర్గా, ముస్లింకోట ప్రాంతాల్లో పీర్లు కొలువుదీరాయి. టేకూరు పేటలో ఆదివారం చిన్నసరిగెత్తు నిర్వహించారు. సోమవారం జింక సవారి, మంగళవారం పెద్దసరిగెత్తు, బుధవారం షహదత్ వేడుకలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ముద్దనూరు: స్థానిక పీర్ల చావిడిలో పీర్లను ఆదివారం మధ్యాహ్నం గ్రామంలో ఊరేగించారు. పీర్ల చావిడి నుంచి పాత వీధి, పాత బస్టాండు నుంచి నాలుగు రోడ్ల కూడలి, బాలుర ఉన్నత పాఠశాల వైపు పీర్ల ఊరేగింపుగా తరలించారు.

రాజుపాలెం: మొహర్రం వేడుకల్లో భాగంగా ఆదివారం సాయంత్రం టంగుటూరు గ్రామంలో బాబా ఫకృద్దీన్ పీరును ఊరేగించారు. మహిళలు, యువకులు పాల్గొన్నారు. అర్కటవేముల, కొరపాడు, గోపల్లెల్లో ఊరేగింపులు నిర్వహించారు. మంగళవారం పెద్ద సరిగెత్తు, బుధవారం పీర్లు నదికి వెళతాయని నిర్వాహకులు తెలిపారు.


ముద్దనూరులో ఊరేగుతున్న పీర్లు


చౌటిపల్లెలో కొలువుదీరిన పీర్లు


పోరుమామిళ్లలో..

21న గురుపౌర్ణమి మహోత్సవం


విరాళాలు సేకరిస్తున్న సాయిబాబా భక్తులు

జమ్మలమడుగు, జూలై 14: ఈనెల 21వ తేదీన గురుపౌర్ణమి సందర్భంగా స్థానిక ముద్దనూరు రోడ్డులోని షిరిడీ జ్ఞానసాయిబాబా ఆలయం, కోవెలకుంట్ల రోడ్డులోని సాయిబాబా ఆలయం, నాగులకట్టవీధిలో వేడుకలు వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీలవారు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. అందులో భాగంగా షిరిడీ జ్ఞాన సాయిబాబా ఆలయ కమిటీవారు ఆదివారం చందాలు, కానుకలు స్వీకరించారు. ఆదివారం ఉదయం 5 గంటలకు ఆలయంలో కాకడ హారతి, విఘ్నేశ్వర, దత్తాత్రేయ పూజ, బాబావారి విగ్రహానికి గంగా జలం, అంచామృతాభిషేకం, పట్టువస్త్రాలతో బాబా వారిని అలంకరించుట, తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. పురవీధుల్లో కోలాటం, మంగళవాయిద్యాలతో ఊరేగింపు , మధ్యాహ్నం 12 గంటలకు అన్నప్రసాద వినియోగం, సాయంత్రం 6 గంటలకు సంధ్యా హారతి, 7 గంటలకు పల్లకి సేవ, 9 గంటలకు శేజ్ హారతి కార్యక్రమాలు నిర్వహిస్తామని భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

ముగిసిన వారాహి నవరాత్రి ఉత్సవాలు


వారాహి హోమం చేస్తున్న భక్తులు

జమ్మలమడుగు, జూలై 14: పట్టణంలోని గ్రంథే సోమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం వారాహి అమ్మవారి నవరాత్రి ఉత్సవాల ముగింపు హోమంతోపాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిరోజు లలితా సహస్ర నామాలు, ఖడ్గ నామావళి, వారాహి అష్టోత్తరం, కుంకుమార్చన, మహామంగళ హారతి, తీర్థప్రసాద వినియోగం నిర్వహించారు.

కనుల పండువగా పోలేరమ్మ జాతర


బోనాలు తీసుకెళుతున్న ప్రజలు

గోపవరం, జూలై 14 : మండలంలోని వల్లెరవారిపల్లెలో ఆదివారం గంగమ్మ జాతర నిర్వహించారు. 60 ఏళ్ల తర్వాత నిర్వహించిన ఈ జాతరలో ఆదివారం భక్తులు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పరిసర గ్రామాల నుంచే కాకుండా సుదూర ప్రాంతాల నుంచి బంధుమిత్రులు, స్నేహితులు పాల్గొన్నారు.

వర్షం కోసం గంగమ్మకు బోనాలు


ఊరేగింపుగా బోనాలు తీసుకెళుతున్న మహిళలు

ముద్దనూరు జూలై 14: వర్షాలు కురవాలని కోరుతూ ఆదివారం మండల పరిధిలోని చింతకుంట గ్రామంలో గంగమ్మకు బోనాలు సమర్పించారు. ఊరేగింపుగా గ్రామంలోని గంగమ్మ ఆలయానికి వెళ్లి బోనాలు సమర్పించి, వర్షాలు కురిపించాలని మొక్కుకున్నారు.

ఏపీఆర్‌సెట్‌లో బి.మఠం విద్యార్థినికి స్టేట్ 29వ ర్యాంకు

బ్రహ్మంగారిమఠం, జూలై 14 : మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన మునగల కల్పన అనే విద్యార్థినికి ఆంధ్రప్రదేశ్ రీసెర్చ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్‌లో రాష్ట్రంలో 29వ ర్యాంకు సాధించింది. తల్లిదండ్రులతో పాటు స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

సెయింట్ జోసెఫ్ పాఠశాలను సందర్శించిన ఎంపీ సీఎం రమేష్


అనాథ పిల్లలతో అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్

ప్రొద్దుటూరు టౌన్, జూలై 14: తనకు విద్యాబుద్ధులు నేర్పిన సెయింట్ జోసఫ్‌పాఠశాలను తన కుటుంబ సభ్యులతో కలిసిఎంపీ సీఎం రమేష్‌నాయుడు ఆదివారం సందర్శించారు. ఉపాధ్యాయుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకోసం వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేయాలని ఉపాధ్యాయులు కోరగా వెంటనే చర్యలు తీసుకోవాలని ఎంపీ తన సిబ్బందిని ఆదేశించారు. పాఠశాల మైదానం పల్లంగా ఉండడంతో వర్షపునీరు నిలుస్తోందని, ఎత్తు చేయాలని డ్రైనేజీ ఏర్పాటు చేయాలని ప్రధానోపాధ్యాయురాలు డయానా విన్నవించగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం పాఠశాలలో ఉన్న అనాథ పిల్లలతో ఎంపీ, కుటుంబ సభ్యులు ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సన్మానాల వెల్లువ

ఎర్రగుంట్ల: అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ ఇంటికి మూడు రోజులగా అభిమానులు, నాయకులు, అధికారులు వెల్లువెత్తుతున్నారు. ఆదివారం జిల్లా నుంచి వచ్చిన అనేక మంది నాయకులు, అధికారులు ఆయనను సన్మానించారు. బిస్మిల్లాబాద్ నేత వాసుదేవరెడ్డి, ప్రొద్దుటూరు, ఎర్రగుంట్ల మండలాలకు చెందిన పలువురు ఆయనను సత్కరించారు.

జీపీఎస్ అమలు ఉత్తర్వులు రద్దు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఒంటేరు శ్రీనివాసులరెడ్డి

ప్రొద్దుటూరు , జూలై 14 : కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టో లో సిపిఎస్ జిపిఎస్ రద్దుల మీద సిపిఎస్ ఉద్యోగులతో చర్చించి ఆమోదయోగ్యమైన పరిష్కారం చూపుతామని చెప్పి ఎన్నికలు అయ్యాక ఇచ్చిన హామీకి వ్యతిరేకంగ ఇచ్చిన జీపీఎస్ ఉత్తర్వులు భేషరత్తుగా రద్దుచేయాలని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసుల రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఉదయం పట్టణంలోని శ్రీరాముల పేట ఉపాధ్యాయ కేంద్రంలో సిపిఎస్ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒంటేరు మాట్లాడుతూ ఉద్యో గుల వ్యతిరేక విధానాలు అవలంబిస్తే ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు. ప్రధాన కార్యదర్శి జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగుల ఆత్మ విశ్వాసాన్ని దెబ్బతీసే విధంగా అర్ధరాత్రి జీవోలు విడుదల చేయడాన్ని సహించ మన్నారు. ప్రభుత్వం పెట్టిన నూతన పెన్షన్ విధానం ఉద్యోగులకు నష్టదాయకమన్నారు. చంద్రబాబు నాయుడు తాము అధికారంలోకి వస్తే పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తామని చెప్పి ఇలాంటి ఉత్తర్వులు తీసుకు రావడం ప్రభుత్వ చిత్తశుద్ధిని శంకించేలా ఉన్నదన్నారు. పాత పెన్షన్ విధానానికి తప్ప ఏ విధానం ఉద్యోగులు ఆమోదించరన్నారు. ఉద్యమాలకు సిద్ధం అవుతామన్నారు. సమావేశంలో మస్తాన్‌వలి ,దేవా, రిజ్వానలి. బాల జో జప్ప, బాబుఫకృద్దీన్, వారాది మధు, రామకృష్ణారెడ్డి, జయశంకర్, బ్రహ్మ నందరెడ్డి, నాగేంద్రా రెడ్డి, భాస్కర్, నాగరాజు, డాక్టర్ సలీం, సాయి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిని పరిరక్షించుకోవాలి


మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రామయ్య

ప్రొద్దుటూరు టౌన్, జూలై 14: జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిని కాపాడుకునేందుకు ఎటువంటి పోరాటాలకైనా సిద్ధం కావాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.రామయ్య పిలుపునిచ్చారు. ఆదివారం సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు వెయ్యికి పైగా ఓపీ, ఇన్‌పేషంట్స్ ఉన్న ఆస్పత్రిలో వైద్య సిబ్బంది కొరత తీవ్రంగా ఉందన్నారు. ఈ ఆస్పత్రిలో మెడికల్ కళాశాల ఏర్పాటుకు అర్హత లేదని చెప్పడానికి వైసీపీ ప్రభుత్వం సిబ్బందిని తగ్గించి తీవ్ర అన్యాయం చేసిందని విమర్శించారు. ఆనాటి వైద్యశాఖ మంత్రి 350 పడకల జిల్లా ఆస్పత్రుల అభివృద్ధికి రూ.500 కోట్లు విడుదల చేసినట్లు ప్రకటించినా అయిదు పైసలు ఖర్చు చేసిన దాఖలాలు లేవన్నారు. ప్రొద్దుటూరులో ఉన్న డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయాన్ని వైసీపీ ప్రభుత్వం పులివెందులకు తరలించడం దారుణమని, ఇక్కడ ఉన్న మెడికల్ ఏజెన్సీలను దృష్టిలో ఉంచుకుని నకిలీ మందులను అరికట్టడానికి ఆ కార్యాలయాన్ని ప్రొద్దుటూరులో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కడప ఉక్కు కర్మాగారం ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి సుబ్బరాయుడు, సభ్యులు శివారెడ్డి, హరి, మద్దిలేటి, గురువయ్య, గోవిందురెడ్డి, వీరయ్యశెట్టి తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా కూరగాయల మార్కెట్

● రూ.6.5 లక్షలతో నిర్మాణం ● వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్న ప్రజలు ● పట్టించుకోని అధికారులు


మార్కెట్ ప్రాంగణంలో నిలిపి ఉంచిన తోపుడు బండ్లు

జమ్మలమడుగు, జూలై 14: జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని రెండవ మార్కెట్ నిరుపయోగంగా మారింది. రెండేళ్ల క్రితం పట్టణంలోని సంజామల మోటు ప్రధాన రోడ్డు పక్కన రూ.6.50 లక్షల వ్యయంతో కూరగాయల వ్యాపార సముదాయం నిర్మించారు. అప్పట్లో కరోనా ఉండడం, ప్రజల సౌకర్యార్థం దీనిని నిర్మించారు. ప్రస్తుతం ఈ మార్కెట్ రాత్రి వేళల్లో ఆవులకు, పందులకు తోపుడుబండ్లు పార్కింగ్ చేయడానికి మాత్రమే ఉపయోగపడుతోంది. మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా పట్టణంలోని పలు వీధుల్లో కూరగాయలు విక్రయిస్తుండడంతో మున్సిపాలిటీ ఆదాయానికి గండి పడుతోంది. సంజామల మోటులో నిర్మించిన కూరగాయల మార్కెట్-2ను వినియోగంలోకి తీసుకువస్తే కొంత మేరకు మున్సిపాలిటీకి ఆదాయం సమకూరు తుందని ప్రజలు అంటున్నారు. మొదటి కూరగాయల మార్కెట్ ఎత్తులో ఉండడంతో అక్కడున్న వ్యాపారులు రోడ్డుపైకి వచ్చారు.

రెండవ మార్కెట్ వ్యాపారులు లేక నిరుపయోగంగా మారింది. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు తనిఖీలు చేసి మున్సిపాలిటీకి ఆదాయం వచ్చేలా రెండవ మార్కెట్‌ను వినియోగంలోకి తెచ్చి అనేక వీధుల్లో ఏర్పాటు చేసిన చోటా మార్కెట్లను రద్దు చేయాలని పలువురు కోరుతున్నారు.

చేపల కోసం చెరువు నీరు వంకపాలు


చెరువు నుంచి పైపులు పెట్టి నీటిని తోడుతున్నదృశ్యం

బ్రహ్మంగారిమఠం, జూలై 14 : మండలంలోని బ్రహ్మంసాగర్ సమీపంలో ఉన్న చెరువులో చేపలను పట్టుకోవడానికి మోటర్ల సాయంతో నీటిని తోడేస్తుండంతో రైతన్నలు లబోదిబోమంటున్నారు. సాగునీటి కోసం ఇబ్బందులకు గురవుతుంటే చెరువులో ఉన్న నీటిని వంక పాలు చేయడం దారుణమని వాపోతున్నారు. చెరువులో చేపలు పట్టుకునే హక్కులు ఈ నెలతో ముగుస్తుండడంతోనే హక్కుదారులు నీటిని వృథా చేస్తున్నారని వాపోతున్నారు. అధికారులు కూడా ఈ విషయంపై పట్టీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా నీటి వృథాను అరికట్టాలని రైతన్నలు కోరుతున్నారు.

కుల అహంకారులను వెంటనే అరెస్టు చేయాలి

జమ్మలమడుగు, జూలై 14: కుల అహంకారులను వెంటనే అరెస్టు చేయాలని కేవీపీఎస్ నాయకులు దాసరి విజయ్, తదితరులు డిమాండ్ చేశారు. ఆదివారం జమ్మలమడుగులో వారు మాట్లాడుతూ జిల్లాలోని ఒంటిమిట్ట మండలంలో కుల అహంకారంతో కదిరి ప్రభాకర్ అనే వ్యక్తిపై వేడి నూనె పోసిన వారిపై వెంటనే ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

పశువుల్లో గర్భకోశ వ్యాధులను నివారించాలి


పశువైద్య శిబిరంలో ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు , జూలై 14 : పశువులలో గర్భకోశ వ్యాధి రాకుండా ముందస్తుగా మందులు వాడాలని జిల్లా పశువైద్య జాయింట్ ,అసిస్టెంట్ డైరెక్టర్లు శారద, ధనుంజ యరెడ్డి సూచించారు. ఆదివారం మండల పరిధిలోని కామనూరులో రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఆదేశాల మేరకు ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాన్ని పశువైద్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే నంద్యాల వరద రాజులరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశుసంపదను పెంచుకో వడానికి గ్రామాలలో సరైన వైద్య సలహాలు చికిత్సలు అందుబాటులోకి రావాలన్నారు. ఈ సందర్భంగా గర్భకోశ వ్యాధులు రాకుండా ఉచితంగా పాడి రైతులకు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల పశువైద్య అధికారులు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన


ఈసీజీ చేస్తున్న వైద్యులు

ఎర్రగుంట్ల, జూలై 14: ఎర్రగుంట్ల మండలంలోని చిలమకూరులో ఆదివారం ప్రొద్దుటూరు హోలిస్టిక్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. బీజేపీ ఎంపీటీసీ నవీన్‌కుమార్ ఈ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ వైద్య శిబిరంలో 98 మందికి చికిత్స అందించారు. 65 మందికి ఈసీజీ, ఎకో, టుడీ పరీక్షలు చేశారు. ఇందులో కొందరిని మెరుగైన వైద్య పరీక్షల నిమిత్తం రెఫర్ చేశారు. మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గుండెవైద్య నిపుణుడు నవీద్‌అహమ్మద్ , జనరల్ ఫిజీషియన్ త్రిశూల్‌రెడి, ఏజీఎం సాంబశివరావు, మేనేజర్ హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

నల్లాయపల్లె భూఆక్రమణలపై విచారణ చేయిస్తాం


మాట్లాడుతున్న మల్లికార్జునరెడ్డి

అట్లూరు, జూలై 14: మండలంలోని నల్లాయపల్లెలో వైసీపీ నేతల భూ ఆక్రమణలపై విచారణ చేయిస్తామని మండల టీడీపీ అధ్యక్షుడు పి. మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఆదివారం రెడ్డిపల్లె టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ నిరుపేదలకు చెందాల్సిన భూములు వైసీపీ నాయకులు ఆక్రమించారని, మండల స్థాయి రెవెన్యూ అధికారులు వాళ్లకు అమ్ముడుపోయారని ఆరోపించారు. గత ఐదేళ్లలో ఒక్క ఎకరా కూడా నిరుపేదలకు పంపిణీ చేయలేదన్నారు. 2023లో భూములు పంపిణీ చేయాలని మండలంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓసీ నిరుపేదలు దాదాపు 1500 అర్జీలు ఇచ్చుకున్నా, ఒక్క ఎకరా కూడా పేదలకు పంపిణీ చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో మండల మాజీ అధ్యక్షుడు మన్యం మహేశ్వర్‌రెడ్డి, యువ నాయకుడు జయకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న బ్రహ్మానందరెడ్డి

పోరుమామిళ్ల, జూలై 14 : విద్యుత్ ఉద్యోగుల సమ స్యలు వెంటనే పరిష్కరిం చాలని ఏపీ ఎలక్ట్రికల్ సిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూ నియన్ జిల్లా కార్యదర్శి బ్రహ్మానందరెడ్డి, సురేశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం పోరుమామిళ్ల ఎస్టీయూ భవన్‌లో ఏపీ ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ విద్యుత్ సంస్థల్లో గత 30 ఏళ్లుగా పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల జీవితాల్లో ఎలాంటి పురోగతి లేదన్నారు. అందరికీ వెలుగునందించే వారు మాత్రం చీకట్లో మగ్గుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు కాంట్రాక్టు కార్మికులను క్రమబద్ధీకరిస్తామని చెప్పి ఓట్లను దండుకుని అధికారంలోకి వచ్చాక విస్మరించారన్నారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్న సుప్రీం కోర్టు తీర్పు అమలు కావడంలేదన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి గురుస్వామి, నవీన్, సుబ్బయ్య, జగదీశ్వర్‌రెడ్డి, ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.

ఆశ కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్

బద్వేలు, జూలై 14: ఆశ కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి వారి సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక జేవీ.భవన్‌లో ఆయన మాట్లాడుతూ కనీస వేతన చట్టంతో పాటు ఈఎస్ఐ, పీఎఫ్ అమలు చేయాలని, నాణ్యమైన యూనిఫాం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆశ కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 22న కడప కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా చేయనున్నామని ఈ కార్యక్రమానికి బద్వేలు నియోజకవర్గ పరిధిలోని ఆశ, కార్యకర్తలందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూ బద్వేలు పట్టణ కార్యదర్శి నాగేష్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మరియమ్మ, శాంతమ్మ, ఆశ వర్కర్లు శ్యామల , వెంకటసుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

గండికోటను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలి


మంత్రి కందుల దుర్గేష్‌తో నాగార్జున

జమ్మలమడుగు, జూలై 14: గండికోటలో పర్యాటక రంగ అభివృద్ధికి చర్యలు తీసుకోవా లని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌కు విన్నవించినట్లు జమ్మలమడుగు జనసేన కోఆర్డినేటర్ నల్లంశెట్టి నాగార్జున తెలిపారు. ఆదివారం ఉదయం నంద్యాలలోని ఆర్కే ఫంక్షన్ హాలులో వారిని కలిసి నివేదిక అందజేశానన్నారు. నియోజకవర్గంలోని మైనార్టీ వారి సమస్యలను పరిష్కరించాలని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జమ్మలమడుగు జనసేన నేత పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలి

ప్రొద్దుటూరు టౌన్, జూలై 14: ప్రజలు శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకుడు రఘునాథరెడ్డి, వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ నరసింహారెడ్డి సూచించారు. ఆదివారం ఉదయం జేవీవీ కార్యాలయంలో పట్టణ వార్షిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జేవీవీ ఉద్యమానికి ప్రొద్దుటూరులో ప్రత్యేక స్థానం ఉందన్నారు. ఎక్కడ మానవ హక్కులకు భంగం కలిగినా ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని సూచించారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని సహించలేని స్థితి ఉందన్నారు. ప్రజల స్వేచ్ఛకు భంగం కలుగుతోందని, ఈ సంస్కృతి మారాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఆడపిల్లలకు స్వేచ్ఛ, ప్రజలకు విద్య, వైద్యం, ఉచితంగా అందించడానికి ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. అనంతరం జేవీవీ నిర్వహించిన కార్యక్రమాల వివరాలను పట్టణ ప్రధాన కార్యదర్శి సునీత వివరించారు. ఈ కార్యక్రమంలో జేవీవీ నాయకులు డాక్టర్ శివారెడ్డి, తవ్వా సురేష్, శ్రీరాములు, రాజేష్, ఈశ్వరయ్య, అల్లాబకష్, తేజస్విని, అక్షయ, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై సామాజిక సర్వే

ఖాజీపేట, జూలై 14: మండల పరిధిలో 2023-24లో చేసిన ఉపాధి హామీ పనులపై వారం రోజులుగా 12 మంది సభ్యులు వారం రోజులుగా సామాజిక సర్వే నిర్వహిస్తున్నారు. ఈ సర్వేకు ఉపాధి కూలీలు, పింఛన్‌దారులు సహకరించాలని ఎస్ఆర్‌పీ కన్నారెడ్డి కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో నిష్పక్షపాతంగా సర్వే చేస్తున్నామని, ప్రతి కార్డుదారును అడిగి వివరాలు తెలుసుకుంటున్నామని, కొలతలు పనిచేసిన మేరకే తీసుకుంటున్నామని తెలిపారు.

మెడికల్ క్యాంపులు నిర్వహించాలి

జమ్మలమడుగు, జూలై 14: డయేరియా, జ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో ప్రభుత్వ వైద్య అధికారులు మెడికల్ క్యాంపులు నిర్వహించాలని జమ్మలమడుగు సీపీఐ కార్యదర్శి ప్రసాద్ డిమాండ్ చేశారు. ఆదివారం సాయంత్రం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం వాతావరణంలో మార్పుల కారణంగా డయేరియా, జ్వరాలు అధికంగా ఉన్నాయన్నారు. వైద్య అధికారులు గ్రామాల్లో పర్యటించాలని మెడికల్ క్యాంపులు నిర్వహించాలని కోరారు. విష జ్వరాలపై ప్రజలకు అవగాహన కలిగించాలని, మురుగు కాలువల్లో వ్యర్థాలు తొలగించి శుభ్రం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు నాగేంద్ర, బాషా తదితరులు పాల్గొన్నారు.